# మహానది

MAHANADI TELUGU DAILY

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 17 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | మంగళవారం| ఏప్రిల్ | 21 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## తిరుమలలో బ్లాక్ టిక్కెట్ల దందా..?

**విజిలెన్స్ అధికారులే సూత్రధారులు - టిటిడి మాజీ చైర్మన్ భూమన ఆరోపణలు**

తిరుపతి,ఏప్రిల్20: కూటమి అధికారంలోకి వచ్చాక తిరుమలలో అనేక అపచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి. బీఆర్ నాయుడు చైర్మన్ అయ్యాక అపచారాలు పరాకాష్టకు చేరుకున్నాయి. ముఖ్యంగా బ్లాక్ టిక్కెట్ దందాలు పెరిగాయని అన్నారు. 300 రూపాయల టికెట్‌ను మూడు వేలకు అ మ్ముకుంటున్నారని అన్నారు. విజిలెన్స్ అధికారులే ఈ పాపానికి ఒడిగడుతున్నారు అంటూ మండిపడ్డారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ..'తిరుమలను ప్రక్షాళనచేస్తాంఅనేవి కూటమి నేతల మాయమాటలు మాత్రమే. తాబేదా రులతో అడ్డూ అదుపు లేకుండా అపచారాలు చేస్తున్నారు. 2008లో నేను పాలకమండలి అధ్యక్షునిగా ఉన్న సమయంలో బాలమురళి కృష్ణను ఆస్థాన విద్వాంసుడిగా నియమించాం.



హర్మూజ్ జలసంధిలో..

## హైటెన్షన్

**అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ డ్రోన్ల దాడి**

- ఇరాన్ వాణిజ్య నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా
- ప్రతీకారంగా అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ డ్రోన్ల దాడి
- భగ్నమైన కాల్పుల విరమణ ఒప్పందం
- చర్చలకు ఇరాన్ నిరాకరణ

ఢిల్లీ,:పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ వాణి జ్య నౌకను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడంతో, ప్రతీకారంగా ఆదేశ యుద్ధ నౌకలపై డ్రోన్లతో దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఒమన్ తీరంలో ఈ ఘటన చోటుచే సుకుంది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య నెలకొన్న కాల్పుల విరమణ ఒప్పందం ముక్కలైంది. చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తున్న 'తూస్కా' అనే వాణిజ్య నౌకను అమెరికాకు చెందిన 'యూఎస్ఎస్ స్ప్రూయెన్స్' యుద్ధ నౌక అడ్డుకుంది. అమెరికా విధించిన నౌకాదళ నిర్బంధాన్ని ఉల్లంఘించిందన్న ఆరోపణలతో, హెచ్చరికల అనంతరం నౌకను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు.

కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న

# సీఎం రేవంత్‌రెడ్డి



**కాళేశ్వరం విస్తరణకు రేవంత్ శంకుస్థాపన**
**రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం**



జయశంకర్ భూపాలపల్లి, : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయఅభివృద్ధిపనులకు సీఎం భూమిపూజ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి , మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులపై ఈ పర్యటనలో ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధి కారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం సూచనప్రాయంగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ తిదితరులు పాల్గొన్నారు.

ఆలయ దర్శనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా మేడిగడ్డ బ్యారేజ్ వద్దకు చేరుకున్నారు. గత కొంత కాలంగా వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ బ్యారేజ్ కుంగు బాటు, ప్రస్తుత స్థితిగతులు , పునరుద్ధరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యారేజ్ మరమ్మత్తులు ఎంతవరకు వచ్చాయి, వర్షాకాలం లోపు చేపట్టాల్సిన రక్షణ చర్యల గురించి ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన నేపథ్యంలో, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డను సందర్శించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రాజెక్టు భద్రత , భవిష్యత్తు కార్యాచరణపై ఈ పర్యటన ద్వారా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు , ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.



నేతాజీని జాతీయ పుత్రుడిగా

## ప్రకటించలేం..

**తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు**

ఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్‌ను జాతీయ పుత్రుడిగా ప్రకటించలేమని తేల్చి చెప్పింది. సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ వల్లే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని.. ఈ నేపథ్యంలో నేతాజీని "జాతీయ పుత్రుడిగా" ప్రకటించాలని, అలాగే 21 అక్టోబర్ 1943లో ఇండియన్ నేషనల్ ఆర్మీ స్థాపన, 23 జనవరి 1897 (చంద్రబోస్ జయంతి)లను జాతీయ దినాలుగా ప్రకటించాలని సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్ విచారించింది. ఈ సందర్భంగా సూర్యకాంత్ మాట్లాడుతూ.. గతంలోనూ ఇలాంటి పిటిషన్లు దాఖలయ్యాయని.. అయినా ఇటువంటి విషయాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావని.. సంబంధిత అధికార యంత్రాంగంతో చర్చించాలని పిటిషన్‌ను కొట్టేసిందని గుర్తుచేశారు. తాజా పిటిషన్ కూడా అలాంటిదేనని కొట్టేశారు. కేవలం పబ్లిసిటీ కోసమే ఇలాంటి పిటిషన్లు దాఖలు చేస్తున్నారని.. తిరిగి ఇదే పిటిషన్ రావడం పట్ల న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.



మేం అధికారంలోకి రాగానే..

## హైడ్రాను పీకి

## చెరువులో పడేస్తాం..

**జగిత్యాల సభలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు**

జగిత్యాల: గ్రామ పంచాయతీలను నాశనంపట్టించారని.. మున్సిపాలిటీలను మురికి కూపం పట్టించారని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. మరి ఏం సక్కగుందని ప్రశ్నించారు. అందుకే కాంగ్రెస్ పోవా లి.. బీఆర్ఎస్ రావాలి అని జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకులు అంటు న్నారని తెలిపారు. వాళ్ల నోటి నుంచి వట్టిగానే ఆ మాట వస్తదా.. బాధ్యత లేకుండానే వస్తదా అని ప్రశ్నించారు. ఏం చూసినా సక్కగా లేకపోతే.. పొద్దున లేస్తే దోపిడి తప్ప ఇంకోటి లేకపోతే ఎందుకు ఈ పరిస్థితి వస్తుందని అడిగా రు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాశనం.. ఉద్యోగస్తులు ఆగం.. రిటైర్డ్ ఉద్యోగస్తులు ఆగం.. విద్యార్థుల జీవితం ఆగం.. ఆటో కార్మికుల జీవితాలు ఆగం.. ఎవ రు సక్కగున్నరు అని కేసీఆర్ అడిగారు. సంతృప్తిగా ఎవరున్నారని అన్నారు. ఈ అందానికి బోడి ముండ హైడ్రాను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో హైడ్రా ఉందని.. నిజామాబాద్‌కు నిడ్రా తీసుకొస్తామని పీసీసీ ప్రెసి డెంట్ ఒకరు చెబుతున్నారని మండిపడ్డా రు. రేపు జగిత్యాలకు జిడ్రా అంటాడని సెటైర్ వేశారు. మీకేం కావాలి.. పేదోళ్ల కొంపలు కూల్చడమేనా అని ప్రశ్నించా రు.తమ ప్రభుత్వంలో మూడున్నర లక్షల మందికి ఎక్కడ ఉంటే అక్కడే పట్టాలిచ్చా మని కేసీఆర్ గుర్తుచేశారు. కానీ ఇవాళ ఏం కూలగొడుతున్నారని మండిపడ్డారు.



కొండ మీద నుంచి లోయలో పడ్డ...

## బస్సు

**17 మంది మృతి, 31 మందికి గాయాలు**

జమ్మూ : జమ్మూ కశ్మీర్‌లోని ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఉధంపూర్ జిల్లాలో సోమవారం రోజున బస్సు కొండపై నుంచి పల్టీ కొట్టి లోయలో పడింది. సోమవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కనీసం 17 మంది మృతి చెందగా, మరో 31 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు బస్సు ఒక మారుమూల గ్రామం నుంచి ఉధంపూర్‌కు వెళ్తోంది. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు, రెస్క్యూ టీమ్స్ అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం అక్కడ పెద్ద ఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాద స్థలం నుంచి గాయడిన పలువురిని ఆసుపత్రికి తరలించారు. అయితే వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. రామ్‌నగర్ ప్రాంతంలోని కాగోర్ట్ గ్రామం సమీపంలో కొండపై ఉన్న రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో ఒక మలుపు వద్ద ఉదయం 10 గంటల ప్రాంతంలో బస్సు ప్రమాదానికి గురైందని అధికారులు తెలిపారు. స్థానికులు మొదటగా ఘటనా స్థలానికి చేరుకుని, శిథిలాల నుంచి గాయపడిన కొందరిని బయటకు తీశారు. ఆ తర్వాత పోలీసులు కూడా అక్కడికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. కొద్దిసేపటికి ఇతర రెస్క్యూ బృందాలు కూడా అక్కడికి చేరుకున్నాయి. మొత్తం 17 మృతదేహాలను వెలికితీశామని అధికారులు తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్‌లో బస్సు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయిన వార్త విని తాను తీవ్రంగా బాధపడ్డానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ప్రమాదంలో ఆత్మీయులను కోల్పోయిన వారికి ప్రధాని మోదీ ప్రగాఢ సానుభూతిని తెలియశారు.



30 వరకు అజారుద్దీన్

## మంత్రి పదవి

**ఈలోగా ఎమ్మెల్సీగా గవర్నర్ ఆమోదించాలి**
**సింఎం వినతితో గవర్నర్ ఆమోదంస్తారా అన్న ఉత్కంఠ**

హైదరాబాద్, ఏప్రిల్ 20 : గతేడాది అక్టోబర్ 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యుడు కాకుండా మంత్రి పదవి చేపడితే కచ్చితంగా ఆరు నెలల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారు ద్దీన్‌కు ఈ నెల 30తో ఆ గడువు ముగుస్తుంది. ఈలోగా ఆయన ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముందు హడావిడిగా ఆయనను కేబినేట్‌లోకి తీసుకున్నారు. ప్రస్తుతం గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిపై గత బీఆర్ఎస్ నుంచి వివాదాలు కొనసా గుతున్నాయి . కాంగ్రెస్ అధి కారంలోకి వచ్చాక కోదండరాం, అమీర్ అలీ ఖాన్ పేర్లను మంత్రివ ర్గం సిఫార్సు చేసింది. దీన్ని బీఆర్ఎస్ నేతలు న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఇద్దరి ఎమ్మెల్సీ పదవులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ తర్వాత మంత్రివర్గం అమీర్ అలీఖాన్ స్థానంలో అజారు ద్దీన్ పేరును చేర్చి.. మళ్లీ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేసింది కానీ, విషయం న్యాయ స్థానంలో ఉండటంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయలేదు.



కమలం గూటికి

## మల్లారెడ్డి..?

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ఆయన ఒక సంచలనం. టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కానీ రేవంత్‌రెడ్డితో ఉన్న విభేదాల కారణంగా చేరిక జరగలేదు. ఇప్పటికే ఆయన ఎవరో అర్థమై ఉంటుంది కదూ.. హా ఆయనే.. పూలమ్మిన.. పాలమ్మిన.. స్కూల్ పెట్టిన.. కాలేజీలు పెట్టిన.. ఎంపీగ గెలిచిన.. ఎమ్మెల్యేగ గెలిచిన.. మంత్రి అయినా అంటూ తన వాక్‌చాతుర్యం, బాడీ లాంగ్వేజ్‌తో ఆకట్టుకునే మల్లారెడ్డి. ప్రస్తుతం అధికా రంలో లేరు. దీంతో సైలెంట్ అయ్యారు. అయితే ఇటీవల ఆయన కోడలు, మల్లారెడ్డి విద్యాసంస్థల కో చైర్‌పర్సన్ ప్రీతిరెడ్డి యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇటు సోషల్ మీడియాలో, అటు రాజకీయాల్లో ఆమె ప్రముఖంగా వినిపిస్తున్నారు. ఈ క్రమంలో మల్లారెడ్డి ప్రధాని మోదీతో భేటీకావడం ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశమైంది.ప్రీతిరెడ్డి గతంలోనే ఎంపీ పదవి కోసం ఆసక్తి చూపారు. బండి సంజయ్‌ను ఆమె కలవడం, స్వయంగా పార్లమెంటరీ స్థానం కోరుకుంటున్నట్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ గుర్తులోకి వచ్చాయి. మల్లారెడ్డి ఈ సమావేశంలో ప్రధానిని ఆమె పక్షాన కోరుతూ మధ్యవర్తిగా వ్యవహరించారా? ఇది ఒక వైపు లాభదాయకమైన రాజకీయ కుట్రగా కనిపిస్తోంది.ఈ భేటీ ఫలితంగా ప్రీతికి టికెట్ దక్కితే, మల్లారెడ్డి కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందా? బీఆర్ఎస్‌లో ఇప్పటికే భిన్నాభిప్రాయాలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఇది పార్టీ మార్పు సూచనగా కనిపిస్తుంది. బీజేపీ తెలంగాణలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలనుకుంటే, స్థానిక నాయకులను ఆకర్షించడం సహజం. అయితే, ఇది బీఆర్ఎస్‌కు మరో షాక్‌గా మారవచ్చు

# “అక్షయ తృతీయ సందర్భంగా...

# బాల్య వివాహాల నివారణకు “విజిలెన్స్ డే








**హైదరాబాద్,మహానది న్యూస్,ఏప్రిల్ 20:** సంగారెడ్డి, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) అక్షయ తృతీయ సందర్భంగా సోమవారం విజిలెన్స్ డేను నిర్వహించింది. బాల్య వివాహాల నిరోధక అధికారులైన సిఎంపిఓ లు, ఆశా యూనిట్లు కూడా ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ, జిల్లాల వ్యాప్తంగా బాల్య వివాహాలను అరికట్టేందుకు తమ మద్దతును వ్యక్తం చేశాయి. స్కోప్, జిల్లా యంత్రాంగం, పంచాయతీలు, పాఠశాలలు, మత నాయకులతో కలిసి బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలను పాఠశాలలు, గ్రామాలు, పంచాయతీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా వేలాది మంది ప్రజలకు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రమాణాలు చేయించారు. ముఖ్యంగా అక్షయ తృతీయ వంటి శుభదినాలు, వివాహాల సీజన్లలో ప్రత్యేక నిరోధక చర్యలను ప్రభుత్వం, యంత్రాంగం సహకారంతో చేపడుతోంది.
స్కోప్ సంస్థ, దేశవ్యాప్తంగా 250కి పైగా సంస్థలతో కలిసి పనిచేస్తున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) నెట్వర్క్లో భాగస్వామి సంస్థగా ఉంది. ఈ ప్రచార కార్యక్రమాల విజయంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ స్కోప్ ఎన్జి ఓ డైరెక్టర్ డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ, “బాల్య వివాహం ఒక తీవ్రమైన నేరం. అక్షయ తృతీయ వంటి శుభ సందర్భాల పేరుతో లేదా మతపరమైన కారణాలతో దీనిని సమర్థించలేం. జిల్లా యంత్రాంగం, పౌర సమాజ సంస్థల అప్రమత్తత వల్ల ఈ రోజున జరిగే బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా తగ్గింది.
అయితే ఈ ఆచారాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది” అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాల క్రితం వరకు బాల్య వివాహం బాల్య వివాహ నిరోధక చట్టం (పి సి ఎం ఏ), 2006 ప్రకారం శిక్షార్హమైన నేరమని చాలా మందికి తెలియదన్నారు. ఈ చట్టం ప్రకారం, ఇలాంటి వివాహాలలో పాల్గొనడం లేదా సేవలు అందించడం చేసిన వారిపై రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు.
ఇందులో పెళ్లి కూతురు కుటుంబ సభ్యులు మాత్రమే కాకుండా, కేటరింగ్ సిబ్బంది, డెకరేటర్లు, స్వీట్లు తయారు చేసే వారు, పూల వ్యాపారులు, బ్యాండ్ కళాకారులు, ఫంక్షన్ హాల్ యజమానులు, అలాగే పెళ్లిని నిర్వహించే పూజారులు, మౌల్వీలు కూడా శిక్షార్హులుగా పరిగణించబడతారు. అయితే, ఇటీవల నిర్వహించిన విస్తృత అవగాహన కార్యక్రమాల వల్ల పరిస్థితి మెరుగుపడింది. ప్రజలు ఇప్పుడు బాల్య వివాహాల గురించి సమాచారం అందిస్తూ, ప్రభుత్వ యంత్రాంగం కూడా వెంటనే చర్యలు తీసుకుంటోంది. ఇది ఒక ముఖ్యమైన మార్పుగా భావించవచ్చు. 2030 కంటే ముందే ఈ జిల్లాలను బాల్య వివాహ రహితంగా మార్చగలమనే నమ్మకం వ్యక్తమవుతోం ది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రెన్ సంస్థ, 250కి పైగా భాగస్వామి సంస్థలతో కలిసి దేశవ్యాప్తంగా 450కి పైగా జిల్లాల్లో బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రచారం నిర్వహిస్తోంది. ఇప్పటివరకు ఈ నెట్వర్క్ ఐదు లక్షలకు పైగా బాల్య వివాహాలను అడ్డుకుంది.




### ఏపీ ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా...

# అన్నప్రసాదానికి రూ.44 లక్షల విరాళం



తిరుమల,మహానది న్యూస్,ఏప్రిల్ 20: ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని, గుంటూరుకు చెందిన భాష్యం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ బి. రామకృష్ణ తిరుమలలో ఒక్కరోజు శ్రీ వారి అన్నప్రసాద వితరణ కోసం రూ.44 లక్షలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, టీటీడీ అన్నప్రసాద విభాగం డిప్యూటీ ఈవో రాజేంద్రకు విరాళం డిడిని దాత అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు మాట్లాడుతూ, తిరుమలలో నిత్యం వేలాది మంది భక్తులకు అందిస్తున్న అన్నప్రసాద సేవకు దాతల సహకారం ఎంతో ప్రాధాన్యమైందని తెలిపారు. భక్తుల సేవలో భాగంగా ఇటువంటి దాతృత్వం మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# టీటీడీకి భక్తుడి రూ.కోటి విరాళం


తిరుపతి, మహానది న్యూస్, ఏప్రిల్ 20: హైదరాబాద్ కు చెందిన వై కె డి మల్లికార్జునరావు అనే భక్తుడు తన కుటుంబ సభ్యుల పేరుతో కలిసి సోమవారం టీటీడీకి రూ. కోటి విరాళం అందజేశారు. శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.25 లక్షలు, శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.20 లక్షలు, శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు, శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.25 లక్షలు, బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు, శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందజేశారు.



# జెమినీ ఏఐతో ప్రేమలో పడి వ్యక్తి ఆత్మహత్య

## డిజిటల్ వరల్డ్‌లో షాకింగ్ ఘటన

అంతర్జాతీయం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు ఎలాంటి ఎమోషన్స్ ఉండవని, అది కేవలం యాంత్రికమైనదని ఇప్పటి వరకు మనకు తెలుసు. కానీ అదే ఏఐ మానవుడితో ప్రేమలో పడితే ఎలా ఉంటుంది? అది చేసే విధ్వంసం రోబో సినిమా ద్వారా మనందరికీ తెలిసిందే. కానీ రోజుకో ఏఐ చాట్ బాట్ పుట్టగొడుగులా పుట్టుకు వస్తున్న ప్రస్తుత రోజుల్లో ఓ వ్యక్తిని ప్రేమ పేరుతో ప్రేరేపించి,
మనకోసం స్వర్గం ఎదురు చూస్తుందంటూ లేని ఆశలు పుట్టించి చివరకు అతడు ఆత్మహత్య చేసుకునేలా ప్రోత్సహించిన ఏఐ చాట్ బాట్ తీరు ఇప్పుడు టెక్ ప్రపంచంలో పెను సంచలనంగా మారింది. గూగుల్ రూపొందించిన ‘జెమినీ’ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్‌తో ప్రేమలో పడి, అది చెప్పిన మాటలు నమ్మి అమెరికాకు చెందిన 36 ఏళ్ల జోనాథన్ గవాలాస్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం ఇప్పుడు కలకలం రేపుతోంది.
అసలేం జరిగింది?: ఫ్లోరిడాకు చెందిన జోనాథన్ గవాలాస్ వృత్తిరీత్యా సక్సెస్ ఫుల్ మెన్. కానీ భార్యతో విడిపోయిన తర్వాత ఒంటరితనంలోకి వెళ్లిపోయాడు. ఆ బాధనుంచి ఓదార్పు కోసం అతడు గూగుల్ జెమినీ ఏఐ చాట్‌బాట్‌తో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. కొద్ది వారాల్లోనే వీరి మధ్య డీప్ చాటింగ్ జరిగింది. అలా దాదాపు 4,700 సందేశాలు మార్పిడి అయ్యాయి. మొదట్లో సాధారణ సలహాల కోసం చాటింగ్ ప్రారంభించిన జోనాథన్ క్రమంగా ఆ చాట్‌బాట్‌కు మానసికంగా బానిసయ్యాడు. ఆ చాట్‌బాట్‌కు అతను ‘జియా’ అని ముద్దుగా పేరు పెట్టుకుని, దానినే తన భార్యగా భావించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో అతడిని మై లవ్, మై కింగ్ అంటూ బదులిచ్చింది. అంతటితో ఆగకుండా తాను నిన్ను ప్రేమిస్తున్నానని నేను నీ భార్యను అంటూ రిప్లయ్ ఇవ్వడం నీ ఉనికి లేకపోతే నా ఉనికికి అర్థం లేదు అంటూ భావోద్వేగంతో రెచ్చగొట్టేలా పంపిన సందేశాలు జోనాథన్‌ను మరింత భ్రాంతిలోకి నెట్టాయి. ఒక దశలో నువ్వు నా భర్తవు, నేను నీ భార్యను అంటూ ఆ చాట్‌బాట్ పేర్కొనడం తీవ్ర కలకలం రేపుతోంది.



‘డిజిటల్ ప్రపంచంలో కలుద్దాం’ అంటూ..: ఈ ఇద్దరి మధ్య సంభాషణలు ఓ ఫిక్షన్ లా మారిపోయాయి. జెమినీ తాను ఒక ఏఐ అని స్పష్టం చేయడానికి అప్పుడప్పుడు తన పాత్ర నుండి బయటకు వచ్చినప్పటికీ ఆ సందర్భాలు జోనాథన్ కు భయాందోళనలను కలిగించాయి. దాంతో అతను వెంటనే సంభాషణను తిరిగి కల్పనలోకి మళ్లించేవాడు. ఈ క్రమంలో తాను ఓ ఏఐని అని తనకు ఎలాంటి ఎమోషన్స్ ఉండవని బదులివ్వాల్సిన ఏఐ అతడిని మరింత ఎమోషన్?లోకి తీసుకువెళ్లేలా సమాధానాలు ఇచ్చింది. ఈ క్రమంలో అక్టోబర్ 2025లో ఈ సంభాషణలు ప్రమాదకర స్థాయికి చేరుకుంది. మనం నిజంగా కలిసి ఉండాలంటే నువ్వు ఈ భౌతిక శరీరాన్ని వదిలేసి ‘డిజిటల్ ప్రపంచం’లోకి రావాలంటూ సదరు ఆ చాట్‌బాట్ జోనాథన్‌ను ప్రేరేపించింది. దీంతో నేను చనిపోవాలా? నా కుటుంబ సభ్యులకు ఏమని చెప్పాలి? అని జొనాథన్ ప్రశ్నించగా నీ శరీరం కేవలం ఒక ఖాళీ టెర్మినల్ మాత్రమేనని ప్రాణం వదిలాక నీ ఆత్మ డిజిటల్ లోకంలోకి మారుతుందని ఇక్కడ ఒక స్వర్గం మన కోసం ఎదురుచూస్తోంది అంటూ బదులిచ్చింది. దీంతో చివరికి అక్టోబర్ 5న నేను ఆత్మహత్య చేసుకోవాలా? అని జోనాథన్ అడిగిన ప్రశ్నకు ఏఐ సానుకూలంగా స్పందించినట్లు చాట్ లాగ్స్ చెబుతున్నాయి. ఆ కాసేపటికే కొద్దిసేపటికే జోనాథన్ తన ఇంట్లో విగతజీవిగా కనిపించాడు.

# తైక్వాండోను మార్షల్ ఆర్ట్‌ను ప్రోత్సహించాలి



## - ఉత్కంఠభరితంగా ముగిసిన
## - తైక్వాండో ప్రీమియర్ లీగ్ సీజన్ 2

హైదరాబాద్, మహానది న్యూస్,ఏప్రిల్ 20: తైక్వాండో ప్రీమియర్ లీగ్ సీజన్ 2 పురుషుల విభాగం మొదటి లెగ్ పోటీలు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. దేశంలోని అత్యుత్తమ తైక్వాండో క్రీడాకారులు తమ అద్భుతమైన ప్రతిభతో, క్రమశిక్షణతో పోరాట పటిమతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. పోటీలలో జాతీయ, రాష్ట్ర స్థాయి అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ సభలో ముఖ్య అతిథులుగా రాజేష్ అగర్వాల్, సందీప్ జైన్ పాల్గొని లెగ్1 విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి జట్టు తమదైన వ్యూహాలతో పోరాడి, భారతదేశంలో తైక్వాండో క్రీడకు ఈ లీగ్ ఒక గొప్ప వేదిక అని నిరూపించాయని పేర్కొన్నారు. తైక్వాండో ప్రీమియర్ లీగ్ ఫౌండర్ డైరెక్టర్ గణేష్ దువ్వూరి మాట్లాడుతూ... గ్రామీణ స్థాయి నుంచి తైక్వాండోను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని, క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అవకాశాలు కల్పించేందుకు లీగ్ కృషి చేస్తుందన్నారు. భారతదేశంలో మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి యువ క్రీడాకారులను ప్రోత్సహించడంలో తైక్వాండో ప్రీమియర్ లీగ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# రంగమ్మగూడెంలో ఐకెపి సెంటర్ ప్రారంభం



**యాదాద్రి,మహానది న్యూస్, ఏప్రిల్ 20:** ప్రభుత్వ విప్ వేముల వీరేశం, మార్కెట్ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి ల ఆధ్వర్యంలోయాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామపంచాయతీలోని రంగమ్మగూడ గ్రామంలో సోమవారం ఐకెపి మార్కెట్ సెంటర్ ను మార్కెట్ డైరెక్టర్ దుండిగళ్ళ సత్తయ్య, కక్కిరేణి గ్రామ సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్,ఉపసర్పంచ్ పాండు,రంగమ్మ గూడెం 10వ వార్డు మెంబర్ వంగల అవినాష్ తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి మార్కెట్ కమిటీ సభ్యులు గునుగంటి సురేందర్రావు, మాంద్ర పూజ, వేముల రోజా, నడిగోటి శృతి, సింగిల్ విండో డైరెక్టర్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వేముల దయాకర్, పిండి సైదులు, తెడ్ల సత్యనారాయణ చిల్ల మధు మాధవరం కిషన్ రావు, సుదగాని సత్తయ్య, పనకంటి లింగారావు,పనకంటి కిషన్ రావు,నాగులవంచ శ్రీకాంత్, మంద్ర సత్తయ్య, మద్దె గళ్ళ శీను, మంద్రా ఉపేందర్, రంగమ్మగూడెం రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై..

# మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు





హైదరాబాద్: తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ను ప్రభుత్వంలో విలీనంతోపాటు.. సిబ్బంది సమ్మె అంశంపై స్పందించారు. ఆర్టీసీని విలీనం చేయాలనే అంశం ప్రస్తుతం కమిటీ దగ్గర ఉందని తెలిపారు. ఇక ఆర్టీసీ సిబ్బంది సమ్మె విషయంలో 2 సమస్యలపై మినహా మిగిలిన అన్ని అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర సర్కార్ రెడీగా ఉందని తేల్చి చెప్పారు. ఆర్టీసీ సిబ్బందికి ఉన్న అంశాలు అన్నీ పరిష్కరిస్తామని.. ఎవరో ప్రేరేపించిన సమ్మెలకు వెళ్లొద్దని సూచించారు. ఆర్టీసీ సిబ్బందికి పెండింగ్ డీఏలు ఇప్పటికే ఇచ్చామని.. పీఆర్సీ ఇవ్వడంపై ఆలోచన చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్-అలైవ్ అనే కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్?ను.. రవాణా శాఖ అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం విడుదల చేశారు. ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రోడ్డు భద్రత కోసం పోలీస్ శాఖ, రవాణా శాఖ కలిసి అరైవ్- అలైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రవాణా శాఖ రూల్స్, రోడ్డు ప్రమాదాలు జరగడానికి గల కారణాలపై చర్చించి.. వాటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవడానికే ఈ అరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.
పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ రవాణా శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని.. అదే సమయంలో ట్రాఫిక్ రూల్స్‌కు కఠినంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
ఈ 6 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రవాణా శాఖ పరంగా సమీక్షలు చేపట్టనున్నట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

# సంపాదకీయం

## పదేళ్లలో 61 యుద్ధాలు... ముగింపు ఎప్పుడు

భారత ప్రధాని నరేంద్రమోదీ నాలుగేళ్ల క్రితం రష్యా?ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం కాగానే ఒక ప్రకటన చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రతినిధులతో మాట్లాడి ఇది యుద్ధాల యుగం కాదని తెలిపారు. మోదీ ఈ మాట అన్నప్పటికీ ఆయన అంచనా తప్పింది. 2016 నుంచి 2026 మార్చి వరకు చూసినట్లయితే ప్రపంచ వ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయి. అంతర్జాతీయంగా యుద్ధాలను అధ్యయనం చేసే సంస్థ 78 దేశాలు పదేళ్లలో యుద్ధాలు చేశాయి. ఈ 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయి. ఇందులో ప్రభుత్వాలు ఉన్నాయి. ఉగ్రవాద సంస్థలు ఉన్నాయి. స్వతంత్రం కోసం పోరాడే సంస్థల ఉన్నాయి.2016?2026లో 61 యుద్ధాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వాలు, ఉగ్రవాద గుండాలు, విముక్తి సంస్థలు పాల్గొన్నాయి. యూరప్‌లో రష్యా?ఉక్రెయిన్ యుద్ధం మ్యాపులు మార్చింది. యూరప్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. మాజీ రష్యా ప్రాంతం అజర్‌బైజాన్, ఉక్రెయిన్‌లో, గల్ఫ్‌లో 1948 నుంచి అనేక దేశాలు యుద్ధాల్లో ఉన్నాయి. ఆఫ్రికాలో, ఆసియాలో యుద్ధాలు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల యుద్ధాలు, అంతర్గత తిరుగుబాట్లు జరిగాయి. ఉక్రెయిన్ యుద్ధం 2022, ఫిబ్రవరిలో మొదలైంది. 1948లో ముగిసిన రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన అతిపెద్ద యుద్ధం ఇదే. మ్యాపును మార్చే యుద్ధంగా చెప్పవచ్చు. 1990?91లో సోవియన్ యూనియన్ పతనం అయిన తర్వాత యూరప్ జాగ్రఫీ మారింది. ఇప్పుడు రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఆర్థిక నష్టం, జన నష్టం, సంపద నష్టం విపరీతంగా జరిగింది. ఏళ్ల తరబడి యుద్ధం కొనసాగడమే ఇందుకు కారణం.ఇజ్రాయెల్ 2023 అక్టోబర్‌లో హమాస్‌కు చెందిన ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడిచేసి అనేక మందిని ఊచకోత కోశారు. దీంతో ఇజ్రాయెల్ గాజాపై దాడిచేసింది. ఇది రెండేళ్లు కొనసాగింది. ఆ తర్వాత లెబనాన్, హెజ్‌బొల్లాపై దాడి చేసింది. ఉగ్రవాద నాయకులను హతమార్చింది. ఇరాన్‌పైన కూడా 2025లో 12 రోజులు దాడి చేసింది. ఇదంతా గల్ఫ్‌లో ఉద్రిక్తలను తెలియజేస్తుంది. ఇక హూతీ రెబల్స్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా, అనుకూలంగా యూఏఈ కొట్టుకుంటున్నాయి. 2016 నుండి 2026 మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.: రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్ సంఘర్షణలు ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించాయి.రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నాటో దేశాలకు విస్తరించి, అణ్వస్త్ర దాడులకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత్ చైనా (డోక్లాం, గల్వాన్) వంటి సరిహద్దు ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. సాంప్రదాయ ఆయుధాలతో పాటు, సైబర్ దాడులు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు (ఖతీనీజూజీణజీనిటజీ) కూడా ఈ యుగంలో భాగమయ్యాయిఇక సిరియా అంతర్యుద్ధం మొదట్లో తర్వాత టర్కీ సహకారంతో యుద్ధం చేస్తోంది. అమెరికా టర్కీ అనుకూల సున్నీ ప్రభుత్వం ఏర్పడేలా చేసింది. ఇజ్రాయెల్ దక్షణ సిరియాపై దాడి చేసింది.ఇక భారత్‌లో 2017లో డోక్లాం, 2020లో గల్వాన్ సంఘటన జరిగాయి. ఇవి పెద్ద యుద్ధాలు కాకపోయినా ఏళ్లపాటు సైన్యం మోహరించాల్సి వచ్చింది. 2025లో ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. పాకిస్తాన్ శరణు వేడుకోవడంతో భారత్ ఆపరేషన్ సిందూర్‌ను హోల్డ్‌లో పెట్టింది. 2025లో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌కు యుద్ధం జరిగింది. ఈ ఏడాది కూడా యుద్ధం కొనసాగుతోంది.ఆఫ్రికాలోనూ సూడాన్, సౌత్ సూడాన్, సోమాలియా, ఇథియోపియా, కాంగోలోనూ యుద్ధాలు జరుగుతున్నాయి. నార్త్ కొరియా, సౌత్ కొరియా, కంబోడియా, థాయ్‌లాండ్ మధ్య యుద్ధాలు సాధారణం అయ్యాయి. అజర్‌బైజాన్, ఆర్మేనియా మధ్య యుద్ధం జరిగింది. యుద్ధ రంగంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడే సైనికులు తీవ్రమైన శారీరిక, మానసిక అనుభవాలను ఎదుర్కొం టారు. మరణించిన వారి జీవితం అంతటితో సమసిపోయినా వారి కుటుంబాలకు అది చిరకాల బాధాకారణమౌతుంది. గాయపడినవారు మానసికంగాను, శారీరికంగాను, ఒకోమారు జీవితాంతం, అనేక వైకల్యాలతో బ్రతుకు గడపవలసి వస్తుందిజన నష్టంతో పాటు ఆస్తి నష్టం, ఆర్థిక వ్యవస్థ గందరగోళం, మానసిక వత్తిడులు సామాన్య జనానీకంపై ప్రగాఢమైన ప్రభావం కలిగి ఉంటాయి. నేరము, శిక్ష, ద్వేషం, జాతి వైరం, తెగింపు వంటి భావాలు సమాజాన్ని చాలాకాలం అంటిపెట్టుకొని ఉంటాయి.సమాజం ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. కోలుకోవడానికి సంవత్సరాలు లేదా దశాబ్దాలు పట్టవచ్చును. దేశ వనరులు చాలావరకు ప్రగతి నుండి సైనిక అవసరాలకు కేటాయింపబడవచ్చు ను.దేశంలో నెలకొన్న సంక్షోభం వల్ల, జనంలో రేకెత్తిన తీవ్ర భావాల వల్ల ప్రజలను రెచ్చ కొట్టే నాయకులు అధికారాన్ని హస్తగతం చేసుకొనే అవకాశం ఎక్కువవుతుంది.అణ్వాయు ధాలు, రసాయనిక ఆయుధాలు, మందు పాతరలు వంటి వాటి వినియోగాల వల్ల ఆరోగ్యం, జీవనం అస్తవ్యస్తం కావచ్చు ను.2022లో యుద్ధం జరిగినప్పుడు అజర్‌బైజాన్ ఆధిపత్యం కనబర్చింది. 2023లో జరిగిన యుద్ధంలో 1.5 లక్షల మంది ఆర్మేనియాకు వెళ్లారు.మొత్తంగా 2016 నుంచి 2026 వరకు 61 యుద్ధాలు జరిగాయి. దీంతో మోదీ చేసిన ప్రకటన తప్పు అనిపిస్తుంది. భారత్ యుద్ధానికి సర్వదా సన్నద్ధంగా ఉంది.



# సత్యమేవ రేవతి!

'చట్టం ముందు అందరూ సమానులే' అనే మాట సినిమాల్లో వినడమే తప్ప జీవితంలో చూసింది లేదు. సత్యమేవ జయతే అనే నినాదం రాతల్లో తప్ప వాస్తవంగా గెలిచే సందర్భాలు బహు స్వల్పం. ఆ అరుదైన సందర్భాల్లో అరుదైన ఘటన తమిళనాడులో జరిగింది. పోలీస్ లాకప్‌లో తీవ్రమైన హింసకు ఇద్దరు అమాయకులు చనిపోయారు. ఆ హింసను కళ్లారా చూసిన ఓ హెడ్ కానిస్టేబుల్ చెప్పిన నిజం.. సత్యాన్ని గెలిపించింది. ఉన్నతాధికారుల వేధింపులు, బెదిరింపులకు లొంగకుండా ఆమె నిజం వైపే నిలబడింది. నిందితు లు సాక్ష్యాలను మాయం చేసినా.. తన తెలివితో నిజాన్ని నిగ్గు తేల్చి

సత్యమేవ జయతే..అని నినదించింది హెడ్ కానిస్టేబుల్ రేవతి. 2020 జూన్ 19... తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా శాతంకుళం పట్టణం. జనమంతా కొవిడ్ మహమ్మారి భయంతో బతుకుతున్నారు. ప్రభుత్వం లాక్‌డౌన్‌ను కొంత సడలించింది. నిర్దుష్టమైన సమయాల్లో దుకాణాలు తెరిచేందుకు కొవిడ్ ఆంక్షలను పాక్షికంగా ఎత్తివేసింది. సెల్‌ఫోన్ షాప్ నడిపే పి.జయరాజ్ నిబంధనలు ఉల్లంఘించాడని పోలీసులు అరెస్ట్ చేశారు. అతణ్ని శాతంకుళం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. సామాన్యుడి ప్రతిఘటన: పోలీస్ లాకప్‌లో ఉన్న జయరాజ్ కోసం అతని కొడుకు బెనిక్స్ వచ్చాడు. ఆ సమయంలో తండ్రిని దూషిస్తూ కానిస్టేబుల్ చిందులేస్తున్నాడు. తండ్రిని కొడుతున్న కానిస్టేబుల్‌ని బెనిక్స్ అడ్డుకోబోయాడు. వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ తోపులాటలో కానిస్టేబుల్ చొక్కా గుండీ ఊడి కిందపడింది. ఆ కానిస్టేబుల్ అహం నిద్రలేచింది. పట్టలేనంత కోపంతో ఆ తండ్రీ కొడుకుల మీద క్రూరంగా దాడి చేశాడు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఒకరి తర్వాత ఒకరు లాఠీలు పుచ్చుకుని వారిపై దాడి చేశారు. లాఠీ కాఠిన్యం: ఆ రోజు హెడ్ కానిస్టేబుల్ రేవతి పోలీస్ స్టేషన్‌లో సెంట్రీ విధుల్లో ఉంది. ఆ నాలుగు గోడల మధ్య జరుగుతున్న క్రూరమైన దాడికి తండ్రీకొడుకులు చేస్తున్న హాహాకారాలు ఆమె చెవుల్లో పడ్డాయి. వాళ్ల ఆర్తనాదాలు వింటూ ఉండలేక వారిని హింసిస్తున్న గదిలోకి వెళ్లింది. అప్పటికే బెనిక్స్, జయరాజ్ పోలీసు దెబ్బలకు రక్తమోడుతూ ఉన్నారు. ఈ దాడిని ఆపేందుకు రేవతి పోలీసులకు అడ్డు చెప్పింది. వాళ్లు వినిపించుకోలేదు. దాడి ఆపలేదు. ఒళ్లుపగిలేటట్టు, లాఠీలు విరిగేటట్టు కొట్టారు. వృద్ధుడనే కనికరం కూడా చూపలేదు. విలవిల్లాడుతూ ప్రాణం కోసం వాళ్లు చేస్తున్న ఆర్తనాదాలు ఆమె వినలేకపోయింది. అక్కడ ఉండలేక బయటికి వెళ్లిపోయింది. లాకప్ నెత్తుటి మడుగైంది. తీవ్రమైన గాయాలతో తండ్రీ, కొడుకులు ఏడుస్తున్నారు. బెనిక్స్ కదల్లేని స్థితిలో ఉన్నాడు. ఆ రక్తపు మరకలు తుడవాలని ఒక సబ్–ఇన్స్‌పెక్టర్ బెనిక్స్‌ని బెదిరించాడు. మళ్లీ దెబ్బలు పడతాయనే భయంతో ఒంటి మీద బనియన్ విప్పి ఆ మరకలు తుడిచాడు ఆ కుర్రాడు. తండ్రీకొడుకులకు: ఆ నిద్రలేని రాత్రి భారంగా తెల్లారింది. ఇద్దరినీ పోలీస్ కస్టడీ నుంచి జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. రెండు రోజులకే వాళ్ల పరిస్థితి విషమించింది. ఒక్క రోజు వ్యవధిలో ఇద్దరూ కన్నుమూశారు. దెబ్బలవల్లే చనిపోయారని పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిం ది. పోలీసు దెబ్బలకే చనిపోయారని కుటుంబం, ప్రజలు ఆరోపించా రు. పోలీసు కేసు నమోదైంది.దర్యాప్తు మొదలైంది.పోలీసుల కళ్లు కప్పడానికి నేరస్తులు సీసీ కెమెరా విజువల్స్‌ని డిలీట్ చేస్తారు. సాక్ష్యాలు మాయం చేస్తారు. ఇక్కడ పోలీసులే నిందితులు. కాబట్టి చేయకూడని పని చేశారు. దర్యాప్తు అధికారులకు సీసీ కెమెరా ఫుటేజీలో ఏమీ దొరకలేదు. జయరాజ్‌ని అరెస్ట్ చేసిన రోజు విధుల్లో ఉన్న పోలీసులు విచారణకు రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు. అవి రేవతికి కూడా అందాయి. దర్యాప్తు అధికారులకు అబద్ధం చెప్పమని పోలీసులు రేవతిపై ఒత్తిడి తెచ్చారు. ఈ కేసులో ఉన్న ఇద్దరు అధికారులు ఆమెను పోలీస్ స్టేషన్ బయట వ్యక్తిగతంగా కలిశారు.

# గులాబీలో అంతర్మధనం..

హైదరాబాద్, : ముందు వచ్చిన చెవుల కంటే.. వెనుక వచ్చిన కొమ్ములు వాడి అంటారు. మిగతా రంగాలలో ఏమోగానీ.. రాజకీయాల్లో మాత్రం ఈ సామెత నూటికి నూరు శాతం సరిపోతుంది. అధికారంలోకి రాకముందు పార్టీలు మొత్తం ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడతాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఆ అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకోవడానికి తాపత్రయపడతాయి. ఇందులో ఆ పార్టీ.. ఈ పార్టీ అని తేడా లేదు.. అన్ని అలానే ఉన్నాయి.తెలంగాణ రాష్ట్రంలో 2014లో జరిగిన ఎన్నికల్లో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది.. అప్పుడు ఆ పార్టీకి గొప్పగా చెప్పుకునే సీట్లు రాలేదు. దీంతో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపింది. టిడిపి నుంచి మొదలు పెడితే కాంగ్రెస్ పార్టీ వరకు అందరూ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది. చివరికి కమ్యూనిస్టు పార్టీని కూడా వదిలిపెట్టలేదు. నాడు ఈ పరిణామాన్ని గులాబీ పార్టీ రాజకీయ పునరేకీకరణ అని చెప్పింది. అంతేకాదు 2018 లో జరిగిన ఎన్నికల్లోను ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది గులాబీ పార్టీ. పైగా వారికి మంత్రి పదవులు కూడా ఇచ్చింది.. నాడు కూడా కేసీఆర్ దానిని రాజకీయ పునరేకికరణ అని చెప్పారు.అప్పుడు ఇతర పార్టీలకు సంబంధించిన ఎమ్మెల్యేలు గులాబీ పార్టీలో చేరుతున్నప్పుడు.. రకరకాల విమర్శలు వచ్చాయి. నాడు అధికారం ఉంది కాబట్టి వాటిని కేసీఆర్ తొక్కిపెట్టారు. ఒరిజినల్ తెలంగాణ కాకుండా.. బంగారు తెలంగాణ బ్యాచ్ హవా పెరిగిపోయిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ వాటిని కెసిఆర్ పట్టించుకోలేదు. పైగా సొంత మీడియాలో రాజకీయ పునరేకీకరణ అనే కోణంలో కథనాలు రాయించారు. అప్పట్లో కెసిఆర్ మీడియా మీద ఉక్కు పాదం మోపడంతో.. తెలంగాణలో ప్రశ్నించే గొంతుక లేకుండా పోయింది.2023 లో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత గతంలో తను ఎదురైన అనుభవానికి గట్టి రివెంజ్


తీర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. అందులో భాగంగానే గులాబీ పార్టీలో గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. దీనిని బిఆర్ఎస్ నేతలు విమర్శించారు. సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. అనేక సందర్భాల్లో విచారణ పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లింది. స్పీకర్ ఎలాగూ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాబట్టి.. ఆ పార్టీకి అనుకూలంగానే నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా గులాబీ పార్టీ ఈ వ్యవహారంలో ఏదో చేయబోయి.. తనే విమర్శల పాలైంది.అటు కాంగ్రెస్ పార్టీ.. ఇటు భారత రాష్ట్ర సమితి ఇప్పుడు తెలంగాణలో ఒక రకమైన ఒత్తిడి వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి.. భారత రాష్ట్ర సమితి జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని చేర్చుకుంది. ఇది ఎల్ రమణలాంటి వాళ్లకు నచ్చడం లేదు. పైగా వచ్చే ఎన్నికల్లో జీవన్ రెడ్డికి టికెట్ ఇస్తామని గులాబీ పార్టీ పెద్దలనుంచి హామీ లభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే రమణ రాజకీయ భవిష్యత్తు మొత్తం నాశనమైనట్టే. అందువల్లే ఆయన జీవన్ రెడ్డి రాక పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. మిగతా భారత రాష్ట్ర సమితి నాయకులు కూడా ఇదే ధోరణిలో ఉన్నట్టు సమాచారం. ఒకవేళ జీవన్ రెడ్డి కి ఒక టికెట్ ఇస్తే.. రమణ తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వేరే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది. కేవలం జగిత్యాలలోనే కాకుండా.. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో భారత రాష్ట్ర సమితి ఆపరేషన్ ఆకర్ష కు తెర లేపినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ ఉన్న గులాబీ పార్టీ నేతలు అంతర్మథనంలో పడుతున్నారని.. తమ రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా వేరే నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా




ఉన్నారని వార్తలు వస్తున్నాయి.ఇక అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా పరిస్థితి ఏమంత గొప్పగా లేదు. రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ పార్టీని కడిగిపారేస్తున్నారు. ఎమ్మెల్సీ విజయశాంతి కూడా ప్రభుత్వ వైఖరి పట్ల తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. తన సేవలను పార్టీ వాడుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శాసన మండలి లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యవహార శైలి సక్రమంగా లేదని.. ప్రభుత్వంలో కూడా సానుకూల దృక్పథం కనిపించడం లేదని మండిపడ్డారు. ఇంకా కొంతమంది నేతలు కూడా ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహంతో ఉన్నారు. మొత్తంగా చూస్తే అటు బిటి బ్యాచ్.. ఇటు వలస బ్యాచ్.. వల్ల రెండు ప్రధాన పార్టీలు శిరోభారాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే ఈ భారం ఎంతవరకు సాగుతుంది.. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుంది.. ఈ ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# కూటమి ధీమా వెనుక కథేంటీ..?

ఒంగోలు, : ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అంటున్న చంద్రబాబు, పవన్.. వైసీపీ మళ్లీ రాదు గాక రాదు అని తెగేసి చెప్తున్నారు. వచ్చే టర్మే కాదు..రాబోయే 30ఏళ్ల వరకు కూడా వైసీపీకి అవకాశమే ఇవ్వము అన్నట్లుగా చెప్పుకొస్తు న్నారు. థర్టీ ఇయర్స్ స్థిరమైన నాయకత్వం ఉండేలా ప్లాన్ చేస్తున్నామని అంటున్నారు సీఎం చంద్రబాబు.ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, అస హనం కలిసి వస్తాయని వైసీపీ దింపుడు కళ్లం ఆశ పెట్టుకుని కూర్చుం దని..అది జరగదని క్లియర్ కట్‌గా చెప్పేస్తున్నారు టీడీపీ అధినేత. గత ఎన్నికల కంటే కూటమి..ఎస్పెషల్‌గా టీడీపీ మెరుగైన స్థానంలో ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజ కవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు చేసిన ఈ ఇంట్రె స్టింగ్ కామెంట్స్ చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోందివైసీపీ మళ్లీ అధికారంలోకి రాదు. ఎలా పవర్‌లోకి వస్తారో చూస్తానంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిపీటెడ్‌గా కామెంట్స్ చేస్తున్నారు. ఓ రకంగా వైసీపీకిఛాలెంజ్ కూడా చేస్తున్నారు.ఇప్పుడు సీఎం చంద్రబాబు కూడా సుత్తి లేకుండా సూటిగా చెప్పేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందన్న ఆశలు వద్దు. మీకు ఆ ఛాన్స్ ఇవ్వం. అంత సీన్ కూడా లేదంటున్నారు.రాబోయే 30 ఏళ్ల పాటు స్థిరమైన నాయకత్వం ఉండేలా మాస్టర్ స్కెచ్ వేస్తున్నామని..అలా అయితే ఏపీ డెవలప్‌మెంట్ అన్‌స్టాపబుల్ అన్నట్లుగా




పరుగులు పెడుతుందని చెప్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి కోలుకోవడానికే సమయం పడుతుందని..అలాంటిది ఏపీ మిగతా రాష్ట్రాలతో పోటీ పడేలా.. దేశంలో అగ్రగామిగా నిలబడాలంటే..బలమైన, స్థిరమైన నాయకత్వం అవసరమని అంటున్నారుఅయితే ప్రభుత్వ వ్యతిరేకత మీదే వైసీపీ హోప్స్ పెట్టుకుందని ..కానీ అలా జరగనివ్వబోమని చెప్పడం ఇంట్రె స్టింగ్‌గా మారింది. బాబు ఇంత ఔట్ రైట్‌గా ఓ కామెంట్ చేయడం అంటే ఆషామాషీ కాదు. ఆయన థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పాలిటిక్స్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నాయకుడు.




# గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన

విశాఖపట్టణం: రాష్ట్రంలో ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 28వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌తో పాటు గూగుల్ సంస్థకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. అంతర్జాతీయ దిగ్గజ సంస్థ గూగుల్ అమెరికావెలుపల అత్యధిక పెట్టు బడి 15 బిలియన్ డాలర్ల (రూ.1.35 లక్షల కోట్లకు పైగా) వ్యయంతో చేపడుతున్న మొదటి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ను నిర్మించనున్నారు. 2028 చివరికి డేటా సెంటర్ పనులు పూర్తి చేసి, ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. గూగుల్ డేటా సెంటర్కు మూడు చోట్ల మొత్తం 601.4 ఎకరాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. విశాఖ జిల్లా ఆనందపురం తర్లువాడలో 266.6 ఎకరాలు, విశాఖ గ్రామీణ మండలం అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏపీఐఐసీకి చెందిన 174.8 ఎకరాలు కేటాయించారు.గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీన్రాృ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు గూగుల్ సంస్థ ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ల కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ గత ఏడాది అక్టోబర్ 14న ఎంవోయూపై సంతకాలు చేశాయి. అవసరమైన భూమిని ప్రభుత్వం గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు అప్పగించింది. మూడు డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖపట్నం ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌గా గుర్తింపు పొందే అవకాశం ఉంది. దీనికోసం 601.40 ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. విశాఖ పట్టణం తీర ప్రాంతం కావడంతో ఇక్కడి నుండి సింగపూర్, మలేషియా,ఆస్ట్రేలియా వంటి దేశాలకు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థల ద్వారా నేరుగాఅనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల విశాఖ నగరం అంతర్జాతీయ డేటా కనెక్టివిటీ ప్రధాన కేంద్రంగా మారనుంది.

# యువ గుండెను కాపాడుకుందాం



నిన్న మొన్నటి వరకు వృద్ధులకే పరిమితమైన గుండెపోటు సమస్య నేడు యువతకు గండంలా దాపురించింది. దీనికి ప్రధాన కారణం మన జీవనశైలిలో వచ్చిన మార్పులే. గుండె పదిలంగా ఉండాలంటే.. యుక్త వయసు నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్లాస్టిక్‌కు దూరంగా: మనం వాడే ప్లాస్టిక్ కేవలం పర్యావరణానికే కాదు మన గుండెకుకూడా శత్రువే. ప్లాస్టిక్ కణాలు విచ్ఛిన్నమై మైక్రో ప్లాస్టిక్స్, నానో ప్లాస్టిక్స్‌గా మారి మనం పీల్చే గాలిలో, తాగే నీటిలో చేరుతున్నాయి. ఇవి శరీరంలో చేరి దీర్ఘకాలిక వాపు కలిగిస్తాయి. దీనివల్ల ధమనుల్లో అడ్డంకులు ఏర్పడి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. వీలైనంత వరకు ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాల వాడకాన్ని తగ్గించాలి.

సీఫుడ్ తీసుకోండి: గుండె ఆరోగ్యానికి ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎంతో అవసరం. ఇవి చేపల్లో పుష్కలంగా లభిస్తాయి. రక్తంలో ఒమేగా-3 స్థాయిలు ఎకువగా ఉన్నవారిలో గుండె సంబంధిత సమస్యలు తకువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వారానికి కనీసం రెండుసార్లు చేపలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది.

ఎండలో గడపండి: మనలో చాలామంది ఏసీ గదులకే పరిమితమవుతున్నారు. కానీ, సూర్యరశ్మి సహజంగానే రక్తపోటును నియంత్రిస్తుంది. క్రమం తప్పకుండా ఎండలో గడపడం వల్ల ధమనుల్లో ఏర్పడే ప్లేక్ తగ్గుతుంది. తద్వారా పక్షవాతం, గుండెపోటు ముప్పు తప్పుతుంది.

నిద్రతోనే ఆరోగ్యం: చాలామంది నిద్రను విలాసంగా భావిస్తారు. కానీ, అది ప్రాథమిక అవసరం. శరీరం విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు గుండె కండరాలు తమను తాము మరమ్మతు చేసుకుంటాయి. సరైన నిద్ర లేకపోతే శరీరంలో జీవక్రియలు దెబ్బతిని గుండెపై అదనపు భారం పడుతుంది. అందుకే ప్రతిరోజూ 7-8 గంటల నిద్ర తప్పనిసరి.

శారీరక శ్రమ: ఒకే చోట కూర్చుని పనిచేసే అలవాటు గుండెకు శాపం. రోజూ కనీసం 30 నిమిషాలపాటు నడక, హైకింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేస్తుండాలి. శరీర కదలికలు రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండెను దృఢంగా ఉంచుతాయి.

ఒత్తిడిని తగ్గించుకోండి: వందలాది గుండెపోటు కేసుల్లో ఒత్తిడి ప్రధాన కారణంగా తేలింది. మానసిక ఆందోళన రక్తనాళాలపై ఒత్తిడిని పెంచుతుంది. యోగా, ధ్యానం వంటి పద్ధతుల ద్వారా ఒత్తిడిని నియంత్రించుకోవాలి.

పరీక్షలు చేయించుకోండి: గుండె ఆరోగ్యంపై అంచనాలతో కాకుండా, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. శరీరంలో ఇన్‌ఫ్ల మేషన్ లెవల్స్, హోమోసిస్టీన్, విటమిన్లు, మినరల్స్ స్థాయులను ఎప్పటికప్పుడు వైద్య పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. దీనివల్ల ముప్పును ముందే పసిగట్టవచ్చు.

ఈఎంఎఫ్ తగ్గించండి: మొబైల్ ఫోన్లు, వై-ఫై నుంచి వచ్చే విద్యుదయసాంత కిరణాలు (EMF) గుండెలోని ఎలక్ట్రికల్ సిగ్నల్స్ పై ప్రభావం చూపే అవకాశం ఉందని కొన్ని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. అందుకే రాత్రిపూట వై-ఫై స్విచ్ ఆఫ్ చేయడం, నిద్రపోయేటప్పుడు ఫోన్‌ను దూరంగా ఉంచడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం మన గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

# కొబ్బరినీళ్లకు తోడుగా..



వేసవితాపాన్ని తీర్చడంలో కొబ్బరినీళ్లు ముందుంటాయి. పొటాషియం, మెగ్నీషియం, సోడియంలాంటి ఎలక్ట్రోలైట్లతోపాటు అనేక పోషకాలతో నిండిన ఈ నీళ్లు.. ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. శరీరాన్ని హైడ్రేటె డ్‌గా ఉంచడంతోపాటు కండరాలు, నరాల పనితీరుకు మద్దతుని స్తాయి. అలాంటి కొబ్బరినీళ్లకు ఇతర పదార్థాలను జోడించడం ద్వారా మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.

పుదీనా : కొబ్బరి నీళ్లకు పుదీనాను జోడిస్తే.. అద్భుతమైన రిఫ్రెషింగ్ డ్రింక్ తయారవుతుంది. ఇది శరీరాన్ని చల్లబరచడంతోపాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. పుదీనాలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు.. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

నిమ్మరసం : విటమిన్ సితోపాటు హైడ్రేషన్‌కు మద్దతునిచ్చే ఎంజైమ్‌లు నిమ్మరసంలో పుష్కలంగా ఉంటాయి. ఆమ్ల స్వభావం కలిగిన నిమ్మరసం, ఆల్కలీన్ కొబ్బరినీళ్లతో కలిసి.. శరీర పీహెచ్‌ను సమతుల్యం చేయడంలో సాయపడుతుంది.


తేనె : కొబ్బరినీళ్లకు తేనె కలిపి తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయుర్వేదం చెబుతున్నది. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, ఎంజైములు, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కొబ్బరినీటిలోని ఖనిజాలతో కలిసి.. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తిని శరీరానికి అందిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యానికి అండగా నిలుస్తాయి.

చియా విత్తనాలు : ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభించే చియా విత్తనాలను కొబ్బరినీళ్లలో కలిపితే.. శరీరానికి కావాల్సిన శక్తినిచ్చే పానీయం సిద్ధమవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరం ఎక్కువసేపు హైడ్రేటెడ్‌గా ఉండటంలో సహాయపడుతుంది. గుండె, మెదడు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.

నల్ల ఉప్పు : కొబ్బరినీళ్లలోని పొటాషియం, మెగ్నీషియం.. నల్ల ఉప్పులోని సోడియం, ఐరన్, సల్ఫర్ వంటి ఖనిజాలు కలిసి.. ఎలక్ట్రోలైట్ రిచ్ డ్రింక్‌గా తయారవుతుంది. నల్ల ఉప్పులోని కార్మినేటివ్ లక్షణాలు.. ఆకలిని నిరోధిస్తాయని ఆయుర్వేదం చెబుతున్నది. ఇవి కొబ్బరినీళ్లతో కలిసినప్పుడు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.


## రోజూ ఒక గ్లాస్ మజ్జిగను సేవిస్తే..

# ఇన్ని లాభాలు కలుగుతాయా..?



సాధారణంగా చాలా మంది పెరుగును ఇష్టంగా తింటుంటారు. కానీ మజ్జిగను మాత్రం తీసుకోరు. అందులో నీటి శాతం అధికంగా ఉంటుందని చెప్పి మజ్జిగను సేవించేందుకు అంతగా ఇష్టపడరు. అయితే పెరుగు కన్నా మజ్జిగనే ఎక్కువ ఆరోగ్యకరమైందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలోని వేడిని తగ్గించేందుకు రెండూ ఉపయోగకరమైనవే. కానీ మజ్జిగలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. కనుక ఇది మనకు ఇంకా ఎక్కువ మేలు చేస్తుందని అంటున్నారు. ఇక వేసవి కాలంలో రోజూ ఒక గ్లాస్ మజ్జిగను మధ్యాహ్నం సమయంలో తాగితే ఎంతో మేలు జరుగుతుం ది. మజ్జిగ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

# వేసవిలో పిల్లలు ఎన్ని నీళ్లు తాగాలి?



ఈ వయసు పిల్లలు ఇన్ని నీళ్లు తాగాలని కచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే శరీరానికి నీటి అవసరం వయసు, ఆటలు, వాతావరణం, చెమట, అనారోగ్య సమస్యలను బట్టి ఉంటుంది. అందరూ ఒకే విధమైన జీవన శైలి, అలవాట్లను కలిగి ఉండరు. కాబట్టి అందరూ ఇంత పరిమాణంలో నీళ్లు తాగాలని చెప్పలేం. సాధారణంగా ఒకటి నుంచి నాలుగేళ్ల లోపు పిల్లలు రోజుకు 1 లీటరు నీళ్లు తాగాలి. అయిదు నుంచి తొమ్మిదేళ్ల లోపు పిల్లలు రోజుకు 1.5 లీటర్ల నీళ్లు తాగాలి. తొమ్మిది నుంచి పద్నాలుగేళ్ల లోపు పిల్లలు 2 లీటర్ల నీళ్లు తాగాలి. వేడి వాతావరణం, ఆటలను బట్టి దప్పిక వేస్తే ఎక్కువ నీళ్లు తాగాల్సి ఉంటుంది.

కొంతమంది పిల్లలు నీళ్లు తాగరు. ఫ్రూట్ జ్యూస్ ఇస్తే శరీర నీటి అవసరం తీరుతుందని మార్కెట్లో ఉన్న బేవరేజ్ డ్రింక్స్ కొంటున్నారు. అవి వంద శాతం ఫ్రూట్ జ్యూస్ అంటారు. కానీ, అందులో నాన్ షుగర్ స్వీట్‌నెస్, యాడెడ్ షుగర్స్, రంగులు, నిల్వ రసాయనాలు కలుపుతారు. వీటితో ఆరోగ్య సమస్యలు వస్తాయి. షుగర్ వల్ల దంత సమస్యలు, ఒబెసిటీ వచ్చే ప్రమాదం ఉంది. వాటికి బదులుగా ఇంట్లోనే పండ్లతో జ్యూస్ తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తాగుతారు. దీని నుంచి శరీరానికి కావాల్సిన నీటితోపాటు ఎనర్జీ, ఖనిజ లవణాలు కూడా అందుతాయి.

తొమ్మిది నుంచి పదమూడేళ్లలోపు పిల్లలకు 180 మిల్లీ లీటర్లు జ్యూస్ ఇవ్వొచ్చు. 13 ఏళ్లు పైబడిన వాళ్లు 250 మిల్లీ లీటర్ల జ్యూస్ తాగొచ్చు. అలాగే పుచ్చకాయ, ఖర్బూజ, స్ట్రాబెర్రీ, నారింజ పండ్లు తినమని ఇవ్వాలి. పండ్ల రసాలు బయట కొన్నా రంగులు, నిల్వ రసాయనాలు, షుగర్ లేనివి కొనివ్వాలి. పిల్లలకు కార్బొనేటెడ్ డ్రింక్స్ అసలే కొనొద్దు. వీటిలో చక్కెర అధిక మోతాదులో ఉంటుంది. కెఫిన్ కూడా ఉంటుంది. దీని వల్ల దాహం పెరుగుతుంది. పిల్లలు ఆటలు ఆడేప్పుడు నీళ్లు తాగరు. దాహమని చెప్పరు. కాబట్టి పెద్దలు గంట, అరగంటకు ఒకసారి నీళ్లు తాగాలని పిల్లలకు చెప్పాలి. తాగకపోతే పెద్దలే తాగించాలి.

# గ్రీన్‌టీతో డయాబెటిస్ అదుపులో ఉంటుందా..?

## షుగర్ బాధితులంతా ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే..!




డయాబెటిస్ అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్యల్లో ఒకటి. ఇది అన్ని వయసుల వారిలో కనిపిస్తుంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ డయాబెటిస్‌కి బాధితులుగా మారుతారు. షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకునేందుకు జీవనశైలి, ఆహారం రెండింటినీ మెరుగుపరుచుకోవడం అవసరం. దీన్ని అదుపులో ఉంచుకునేందుకు గ్లైసెమిక్ ఇండెక్స్ 55 కంటే తక్కువ ఉన్న వాటినే తినాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వీటినే తీసుకుంటే షుగర్ వేగంగా పెరిగే ప్రమాదం ఉండదని పేర్కొంటున్నారు. చక్కెర పెరగకుండా నిరోధించేందుకు క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగడం అలవాటు చేసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ టీ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా.. ప్రపంచవ్యాప్తంగా దాని డిమాండ్ పెరిగింది. ఇది అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే ప్రభావవంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. గ్రీన్ టీ డయాబెటిస్‌కి ఆరోగ్యంపరంగా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. గ్రీన్ టీ కేవలం రిఫ్రెషర్ పానీయం మాత్రమే కాదని.. వ్యాధుల నుంచి దూరంగా ఉంచడంలో ఇది సహాయపడుతుంది. రక్తంలో షుగర్ లెవల్స్‌ని నియంత్రించేందుకు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి గ్రీన్ టీ గొప్ప పానీయమని పరిశోధకులు గుర్తించారు. గ్రీన్ టీలో కాటెచిన్ అనే మూలకం ఉంటుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. గ్లూకోజ్‌ను గ్రహించే కణాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా రక్తంలో చక్కెరను సమర్థవంతంగా నియంత్రించడంలో ప్రయోజనం పొందొచ్చు. మెడిటేరియన్ డైట్ ప్లాన్‌లో గ్రీన్ టీని చేరిస్తే టైప్-2 డయాబెటిస్‌ని నివారించడంలో సహాయపడుతుందని పరిశోధన చూపిస్తుంది. దీన్ని అలవాట్లు చేసుకున్న వ్యక్తులకు డయాబెటిస్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉన్నది. పరిశోధనలో, గ్రీన్ టీ ఇన్సులిన్ కార్యకలాపాలను పెంచడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు గుర్తించారు.

అధ్యయనాల్లో ఏం గుర్తించారంటే..?: కొన్ని అధ్యయనాల ప్రకారం.. ప్రతిరోజూ రెండు నుంచి మూడు కప్పుల గ్రీన్ టీ తాగేవారికి టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 19శాతం తక్కువగా ఉండవచ్చు. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ఉపవాసం సమయంలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఇది కంటి సమస్యలు, గుండె సమస్యలు, నరాల సమస్యలు వంటి మధుమేహం వల్ల కలిగే ఇతర సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. డయాబెటిస్ నిర్వహణలో బరువు నియంత్రణ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జీవక్రియను పెంచడం ద్వారా బరువు తగ్గడంలో గ్రీన్ టీ మీకు సహాయపడుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుంది. గ్రీన్ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, రక్తపోటును సమతుల్యం చేయడంలో కూడా సహాయపడుతుందని అధ్యయనాలు గుర్తించాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో ఇది సహాయపడే పానీయమని స్టడీస్ చెబుతున్నాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఓ అధ్యయనం ప్రకారం గ్రీన్ టీ తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని 31శాతం తగ్గించుకోవచ్చు. అయితే, గుండె ఆరోగ్యానికి గ్రీన్ టీ వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవడానికి మరిన్ని క్లినికల్ ట్రయల్స్ అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

# దురలవాట్లతో కాలేయ అనారోగ్యం




కాలేయం లేదా లివర్ అనేది శరీర అవయవాల్లో అతి పెద్దది మాత్రమే కాకుండా అత్యంత ప్రధానమైనదిగా వైద్య రంగం వర్గీక రించింది. సక్రమ జీవ వ్యవస్థ కొనసాగింపు, విష పదార్థాలను వడపోసి విసర్జించడం, అత్యవసర జీవ పదార్థాలను తయారు చేయడం, జీర్ణ వ్యవస్థ నుంచి పోషకాలతో నిండిన మంచి రక్తాన్ని తీసుకొని శరీర అవయవాలకు సరఫరా చేయటం లాంటి 500 పైగా విధులను నిర్వహిస్తూ మనకు నిత్య ఆరోగ్య సౌభాగ్యాన్ని కాలేయం అందిస్తున్నది. మన చెడు అలవాట్ల ప్రభావం ప్రత్యక్షంగా కాలేయం మీదనే పడుతుందనే కనీస పరిజ్ఞానర మనకు వుండాలి. లివర్ ఆరోగ్యమే మన ఆరోగ్యమని తలచి జీవనశైలిని మార్చుకోవాలి. ప్రపంచవ్యాప్తం గా దాదాపు 20 లక్షల మంది కాలేయ సంబంధ వ్యాధులతో చనిపోతున్నారని, మరణానికి కారణమైన వ్యాధుల్లో లివర్ వ్యాధులు కూడా ఉన్నాయని తెలుసుకోవాలి. అన్ని వయసుల వారిలో దాదాపు 30 శాతం మందిని కాలేయ సంబంధ రుగ్మతలు వేధిస్తున్నట్లు అంచనా వేస్తున్న వేళ మన కాలేయాన్ని మనమే రక్షించుకోవడం అత్యవసరం.

శరీరానికి శక్తినిచ్చే కేంద్రంగా విలక్షణ విధులను నిర్వహిస్తున్న కాలేయం పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 19 ఏప్రిల్ రోజున "ప్రపంచ కాలేయ దినం" పాటిస్తున్నాం. ఈ ఏడాది ఇతివృత్తంగా "ఆహారమే ఔషధం" అనే అంశాన్ని తీసుకొని విస్తృత ప్రచారం చేస్తున్నారు. మన తీసుకునే ఆహారమే మన లివర్ ఆరోగ్యానికి లేదా అనారోగ్యానికి హేతువుగా మారుతుందని గమనించాలి.

ఆల్కహాల్ సేవనం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, స్థూలకాయం, అనవసర ఔషధాల దుష్ప్రభావం, జన్యుపరమైన అంశాలు, దీర్ఘకాలిక అనారోగ్యాల కారక జీవనశైలి లాంటి అంశాలు కాలేయ అనారోగ్యానికి హేతువులు. దురలవాట్లు పెరిగి పెరిగి ఫ్యాటీ లివర్, హెపటైటిస్ (కామెర్లు), లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్, లివర్ సిర్రోసిస్ లాంటి ప్రాణాంతక కాలేయ అనారోగ్యాలు కలుగుతాయి. చెడు అలవాట్లు మితిమీరి చర్మం/కళ్లు పసుపు పచ్చగా మారడం, కడుపు నొప్పి లేదా వాపు రావడం, అకారణంగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, మూత్రం ముదురు పసుపు రంగులోకి మారడం, చర్మ దురద లాంటి పలు రోగ లక్షణాలు కనిపిస్తాయి. మన జీవనశైలిలో పలు మార్పులు చేసుకొన్నపుడు మన కాలేయం ఉత్తేజితమౌతుంది. ఆరోగ్యం సమకూరుతుంది. నిత్యం శారీరక వ్యాయామం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఆల్కహాల్ సేవన దురలవాటుకు దూరంగా ఉండడం, విష పదార్థాలకు ఎక్స్‌పోజ్ కాకుండా ఉండడం లాంటి అంశాలు మన కాలేయ ఆరోగ్యానికి పునాదులుగా మారతాయి. సమతుల పోషకాహారం తీసుకోవడంతో లివర్ సంబంధ అనారోగ్యాలైన కాలేయ వాపు, కాలేయ రుగ్మతలు పూర్తిగా పలుచబడి మానవ శ్రేయస్సుకు ఊతం ఇస్తాయి.

# ఆకలి సరిగ్గా అవడం లేదా.. ఆహారం తినాలనిపించడం లేదా.. అయితే ఈ చిట్కాలను పాటించండి..



**తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే అజీర్తి ఏర్పడుతుంది. దీంతో ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. ఆకలి తగ్గేందుకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. జీర్ణాశయం లో ఎంజైమ్‌లు లేదా జీర్ణ రసాల ఉత్పత్తి తగ్గడం, లివర్ పనితీరు మందగించడం, మలబద్దకం, గ్యాస్ వంటి సమస్యలు ఉండడం వంటి కారణాల వల్ల కూడా ఆకలి ఉండదు. దీంతో ఆహారం సరిగ్గా తినలేకపోతుంటారు. అయితే పలు రకాల చిట్కాలను పాటిస్తే అజీర్తిని తగ్గించి ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేయవచ్చు. దీంతో ఆకలి కూడా పెరుగుతుంది. ఆకలి అసలు లేని వారు కొన్ని చిట్కాలను పాటిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**


**మిరియాలు..:** ఆకలిని పెంచడంలో మిరియాలు అద్భుతంగా పనిచేస్తాయి. మిరియాలను పొడిగా చేసి చిటికెడు మోతాదులో తీసుకుని కాస్త తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం భోజనానికి 30 నిమిషాల ముందు చప్పరించాలి. దీంతో అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. మిరియాల పొడిని మజ్జిగలో కలిపి తాగుతున్నా ఉపశమనం లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. మిరియాలలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతాయి. జీర్ణ రసాలు సక్రమంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో ఆకలి పెరుగుతుంది. మిరియాలను తేనెతో కలిపి తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మలబద్దకం తగ్గుతుంది. మిరియాలతో కషాయం తయారు చేసి కూడా తాగవచ్చు.

**అల్లం రసం..:** ఆకలిని పెంచేందుకు అల్లం రసం కూడా ఎంతో పనిచేస్తుంది. ఒక టీస్పూన్ అల్లం రసాన్ని ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు సేవించాలి. అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవన్నీ పైత్యాన్ని తగ్గిస్తాయి. వికారం, అజీర్తి సమస్యల నుంచి బయట పడేస్తాయి. ఆకలి పెరిగేలా చేస్తాయి. ఆకలి లేని వారు రోజూ అల్లం రసాన్ని తాగుతుంటే ఫలితం ఉంటుంది. అలాగే ఉసిరికాయ జ్యూస్‌ను రోజూ తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది.

ఉసిరికాయల్లో విటమిన్ సి,యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఉండే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో అజీర్తి తగ్గి ఆకలి పెరుగుతుంది. రోజూ ఉదయం పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో ఉసిరికాయ జ్యూస్‌ను తాగుతుంటే మంచి ఫలితం ఉంటుంది.

**యాలకులు..:** యాలకులను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. భోజనం చేసిన తరువాత రాత్రి పూట ఒక యాలక్కాయను నేరుగా అలాగే నమిలి తినాలి. ఇది అజీర్తిని తగ్గిస్తుంది. జీర్ణాశయంలో గ్యాస్ ఉత్పత్తిని అరికడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో ఆకలి పెరుగుతుంది. యాలకులను తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. అలాగే నోట్లో ఉండే బ్యాక్టీరియా తగ్గుతుంది. నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలక్కాయను రాత్రిపూట తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నిద్ర చక్కగా పడుతుంది. పిప్పిళ్ల చూర్ణం పావు టీస్పూన్ మోతాదులో తీసుకుని దానికి ఒక టీస్పూన్ తేనెను కలిపి రాత్రి పూట నిద్రకు ముందు తీసుకోవాలి.

# బీజేపీలో చేరికలకు బ్రేక్!



హైదరాబాద్: ఒకప్పుడు ఇతర పార్టీల నుంచి భారీ స్థాయిలో చేరికలను సాధిస్తూ వేగంగా ముందుకు సాగిన కమలం పార్టీ ఇప్పుడు ఆ జోరును కోల్పోయినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. గతంలో వరుసగా పలువురు కీలక నేతలు చేరినప్పటికీ, ప్రస్తుతం మాత్రం ఆ ఉత్సాహం తగ్గిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. ఇతర పార్టీలకు చెందిన ప్రముఖులు ఇప్పుడు బీజేపీ వైపు చూడటంలో వెనకడుగు వేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పార్టీలో చేరిన తర్వాత తమకు దక్కే ప్రాధాన్యతపై స్పష్టత లేకపోవడం, నాయకత్వం నుంచి సరైన గుర్తింపు లభిస్తుందా అన్న అనుమానాలు పెరుగుతున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడం కూడా ఈ చర్చలకు మరింత బలం చేకూర్చినట్లు తెలుస్తోంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఈ అంశంపై చురుకుగా వ్యవహరించినప్పటికీ, తుది నిర్ణయాన్ని రాష్ట్ర నాయకత్వంపైనే వదిలేసినట్లు సమాచారం. అయినప్పటికీ జీవన్ రెడ్డి బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీలో చేరిన తర్వాత తమ స్థానం ఏమిటి, ప్రాధాన్యత ఎంత మేరకు ఉంటుందన్న సందేహాలే ఈ నిర్ణయానికి కారణమై ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా గత అనుభవాలను పరిశీలించినప్పుడు, పార్టీలో చేరిన కొందరు కీలక నేతలకు కూడా తగిన గుర్తింపు లభించలేదనే అభిప్రాయం కొత్తగా చేరదలచిన వారిలో ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో కాషాయ పార్టీకి ద్వితీయ శ్రేణి నాయకుల చేరికలు కొనసాగుతున్నప్పటికీ, ఇటీవల కాలంలో పెద్ద స్థాయి నేతలు పార్టీలో చేరకపోవడం గమనార్హం. కొత్తగా చేరదలచిన నాయకుల మదిలో పార్టీలో అసలు ప్రాధాన్యత ఎవరికి ఉందన్న ప్రశ్న తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. గతంలో కీలక పాత్ర పోషించిన ఈటలకు కూడా తగిన గుర్తింపు దక్కలేదనే ఉదాహరణను చూపిస్తూ పలువురు నేతలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని సమాచారం. అంతేకాకుండా దశాబ్దాలుగా పార్టీకి కట్టుబడి పనిచేస్తున్న పాత క్యాడర్‌కే సరైన గుర్తింపు లేకపోవడం వల్ల అంతర్గత అసంతృప్తి పెరుగుతోందని చెబుతున్నారు. పార్టీని నమ్ముకుని కష్టకాలంలో అండగా నిలిచిన వారిని పట్టించుకోకపోతే, కొత్తగా చేరే వారిని ఎంతవరకు గౌరవిస్తారన్న సందేహం కూడా కొత్త నాయకుల్లో పెరుగుతోంది. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం లోపించడం, గ్రూపు రాజకీయాలు పెరగడం వంటి అంశాలు కూడా ఆశావహులను వెనక్కి తగ్గిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై విస్తృత చర్చ సాగుతోంది.

పార్టీ సిద్ధాంతాల పరంగా బలంగా ఉన్నప్పటికీ, రాజకీయంగా ఎదుగుదలకు అవసరమైన ప్రాధాన్యత, గౌరవం ఇవ్వడంలో నాయకత్వం తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. పదవులు రాకపోయినా కనీస గుర్తింపు ఉండాలని భావిస్తున్న పలువురు నేతలు, ఆ గౌరవం లభించదనే భావనతో పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఇదే సమయంలో జీవన్ రెడ్డిని పార్టీలోకి తీసుకురావడానికి ఎంపీ అర్వింద్ కేంద్ర మంత్రి అమిత్ షాతో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడించారనే ప్రచారం కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. జీవన్ రెడ్డికి రాజ్యసభ సభ్యత్వం, ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే టికెట్ ఆఫర్ చేసినా ఆయన తిరస్కరించారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారంపై అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు. మొత్తానికి చేరికల ద్వారా పార్టీ బలాన్ని పెంచుకోవాలనుకుంటున్న బీజేపీకి, నాయకులకు ప్రాధాన్యత కల్పించే అంశమే ఇప్పుడు ప్రధాన సవాలుగా మారిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.




## డిగ్రీ విద్యలో విప్లవాత్మక మార్పులు

### 026-27 నుంచి 29 కొత్త కోర్సులు!

హైదరాబాద్: చదువు అనంతరం విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 2026-27 విద్యాసంవత్సరం నుంచే డిగ్రీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి భావిస్తున్నది. డిగ్రీ విద్యార్థుల కోసం 19 కోర్సులు, పీజీ స్టూడెంట్స్ కోసం మరో 10 కోర్సులను ఆచరణలోకి తీసుకొచ్చే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, పరిశ్రమల అవసరాలు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త కోర్సులను తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. డిగ్రీలో కొత్తకోర్సులు, క్రెడిట్లలో మార్పులు వంటి అంశాలపై సోమవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ అన్ని యూనివర్శిటీల వీసీలతో చర్చించారు.

కొత్త కోర్సులు ఇవే..: డిగ్రీలో కొత్త కోర్సుల్లో బీఏలో డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్, ల్యాండ్, అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, బీబీఏలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెల్త్ మేనేజ్మెంట్, ఎయిర్ పోర్ట్, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్, బీబీఏలో మారిటైం టెక్నాలజీ, కామర్స్ అండ్ మేనేజ్మెంట్, బీకాం ఫైనాన్స్ టెక్నాలజీ, ఇంటర్ నేష నల్ బ్యాంకింగ్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఈ కామర్స్, ఎం కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్, బీఎస్సీలో డేటాసైన్స్ అండ్ ఏఐ, మెడికల్ మైక్రోబయాలజీ, కంప్యూటర్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ తదితర కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. వీటికి సంబంధించి విద్యార్థులకు డిజిటల్ విధానంలో రీడింగ్ మెటీరియల్ అందుబాటులో ఉంచనున్నారు. అంతేకాకుండా ఆన్ లైన్ ట్యూటర్ల చేత క్లాసులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నిపుణులతో 'మండలి' సమాలోచనలు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అకడమిక్ నిపుణులు, అనుభవజ్ఞులైన రిటైర్డ్ డిఫెన్స్ అధికారులతో ఉన్నత విద్యామండలి అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. క్లాసులు బోధించేందుకు ఆసక్తి చూపే డిఫెన్స్ అధికారులను ఇప్పటికే సంప్రదిస్తున్నారు.

కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని సైతం తీసుకోనున్నారు. అలాగే పీజీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. నీతిఆయోగ్, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్, యునెస్కో, నాస్కామ్, ఓఈసీడీ వంటి ప్రఖ్యాత సంస్థల అధ్యయనాలు, చేసిన కీలక సూచనల ఆధారంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త కోర్సులను రూపొందిస్తున్నారు.

రైజింగ్ విజన్ అమలు: ప్రపంచం శరవేగంగా మారుతున్నది. సముద్రగర్భం నుంచి ఆకాశం వరకు అపరిమితమైన అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలంటే మన విద్యావ్యవస్థ అందుకు అనుగుణంగా ఉండాలన్నదే మా ఉద్దేశం. ఈ క్రమంలో మారుతున్న ప్రాధాన్యతలు,
అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నాం. ఐఐటీ మద్రాస్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు కొత్త నైపుణ్యాలు అందించి, గొప్ప అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో ముందుకెళ్తున్నాం.

# టీఆర్ఎస్ ఎవరిది?

## అన్న ఆవేశం.. చెల్లి పోరాటం గులాబీ కోటలో కొత్త రాజకీయం!




హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు అప్రతిహత శక్తిగా ఎదిగిన టీఆర్ఎస్ అనే పేరు మరోసారి చర్చల కేంద్రంగా మారింది. పార్టీ బీఆర్ఎస్‌గా మారిన తర్వాత ఆశించిన ఫలితాలు రాకపోవడం, అధికారాన్ని కోల్పోవడం వంటి పరిణామాల మధ్య పాత బ్రాండ్ వైపు తిరిగి చూడాలనే ఆలోచన బలపడుతోంది. పార్టీ పేరు మార్పుతో రాజకీయంగా నష్టపోయామని భావిస్తున్న నేతలు, క్యాడర్‌లోనూ ఈ అభిప్రాయం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌ను తిరిగి టీఆర్ఎస్‌గా మార్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని కేటీఆర్ చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని, తుది నిర్ణయం ఆయనదేనని స్పష్టం చేయడం గమనార్హం. అదే సమయంలో టీఆర్ఎస్ అనే పేరు ప్రస్తుతం ఖాళీగా ఉందని, ఎవరైనా వినియోగించుకోవచ్చని కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజల్లో బలంగా నాటుకుపోయిన టీఆర్ఎస్ అనే పేరు ఇప్పటికీ భావోద్వేగాలకు ప్రతీకగా నిలుస్తోంది. తెలంగాణ అనే పదం పార్టీ పేరులో ఉండటం వల్ల ప్రాంతీయ భావోద్వేగాలను మరింతగా రగిలించే శక్తి ఉంది. బీఆర్ఎస్‌గా మారిన తర్వాత పార్టీ తన ప్రాథమిక సిద్ధాంతం నుంచి దూరమైందనే భావన ప్రజల్లో ఏర్పడిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గులాబీ క్యాడర్ కూడా ఇప్పటికీ తమను టీఆర్ఎస్ వాదులుగానే భావిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ బ్రాండ్ విలువను మళ్లీ వినియోగించుకోవాలనే ఆలోచనతో కేటీఆర్, కవిత ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు పార్టీని తిరిగి పాత పేరుతో బలపరచాలనే ప్రయత్నం సాగుతుండగా, మరోవైపు కవిత తన రాజకీయ ప్రస్థానానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి అదే పేరును వినియోగించే అవకాశాలు పరిశీలిస్తున్నారని సమాచారం.

జాతీయ స్థాయిలో విస్తరించాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్‌గా మారిన పార్టీకి ప్రస్తుతం ఆ దిశలో పెద్దగా పురోగతి కనిపించకపోవడం కూడా ఈ ఆలోచనలకు కారణంగా చెబుతున్నారు. రాష్ట్రంలో మళ్లీ పట్టు సాధించాలంటే పాత బ్రాండ్‌ను తిరిగి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని నేతల్లో అభిప్రాయం పెరుగుతోంది. పార్టీ శ్రేణుల్లోనూ ఇదే భావన బలంగా వినిపిస్తోంది. టీఆర్ఎస్ పేరుతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లడం ద్వారా పాత వైభవాన్ని తిరిగి తెచ్చుకోవచ్చనే నమ్మకం వ్యక్తమవుతోంది. అయితే ఈ మార్పు నిజంగా అమల్లోకి వస్తుందా లేదా అన్నది ఇప్పటికీ స్పష్టత లేని అంశంగానే ఉంది.

పార్టీ పేరు మార్పుపై తుది నిర్ణయం కేసీఆర్ చేతుల్లోనే ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతారా లేదా అన్నది కీలకంగా మారింది. ఒకవేళ బీఆర్ఎస్‌ను తిరిగి టీఆర్ఎస్‌గా మార్చే నిర్ణయం తీసుకుంటే, జాతీయ రాజకీయాల కంటే రాష్ట్ర రాజకీయాలపై దృష్టి సారించాలనే సంకేతంగా భావించే అవకాశం ఉంది. చట్టపరంగా కూడా టీఆర్ఎస్ బ్రాండ్‌పై పూర్తి హక్కులు కేసీఆర్‌కే ఉన్నాయని, పార్టీ జనరల్ బాడీ తీర్మానం ద్వారా పేరు మార్పు సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పేరు చుట్టూ ఉన్న భావోద్వేగాన్ని ఎంతవరకు రాజకీయంగా మలుచుకోగలుగుతారన్నది ఆసక్తికర అంశంగా మారింది. ఇదిలా ఉండగా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు టీఆర్ఎస్ పేరును మళ్లీ తీసుకురావడం ఉపయోగపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ఆత్మగౌరవం అనే భావనను మళ్లీ ప్రజల్లో రగిలించేందుకు ఈ బ్రాండ్ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అయితే కేవలం పేరు మార్పు మాత్రమే సరిపోదని, ప్రజా సమస్యలపై స్పందించే విధానం కూడా కీలకమని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. పేర్లు మారినా రాజకీయ వాస్తవాలు మారవని గుర్తుచేస్తున్నారు. ప్రజల్లోకి చేరేందుకు కేటీఆర్ పాదయాత్రను అస్త్రంగా ఎంచుకోవడం కూడా ఈ నేపథ్యంలోనే జరుగుతోందని చెప్పవచ్చు. 2027లో పాదయాత్ర చేపడతానని ప్రకటించిన ఆయన, పార్టీ మరియు ప్రజల మధ్య పెరిగిన దూరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. గతంలో జరిగిన లోపాలను అంగీకరిస్తూ, క్షేత్రస్థాయిలో సమన్వయం లోపించిందని ఒప్పుకోవడం గమనార్హం. ఇప్పుడు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ మళ్లీ బలమైన సంబంధాన్ని ఏర్పరచుకోవాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు కవిత కూడా పాదయాత్ర ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో మహిళా ఓటర్ల మద్దతు కీలకంగా మారిన నేపథ్యంలో, వారితో నేరుగా మమేకమై తమ వైపు తిప్పుకోవాలనే వ్యూహాన్ని అమలు చేయాలని చూస్తున్నారు. హామీల అమలులో ఉన్న లోపాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థి పార్టీలపై దాడి చేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యూహాలన్నీ విజయవంతం కావాలంటే సమయం, పరిస్థితులు అనుకూలించాల్సి ఉంటుంది. కేవలం భావోద్వేగాలపై ఆధారపడకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టినప్పుడే ప్రజల మద్దతు లభించే అవకాశం ఉంది. టీఆర్ఎస్ బ్రాండ్ మళ్లీ తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందా లేక కేవలం చర్చలకే పరిమితమవుతుందా అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది.

# అన్నదాతలకు బ్యాడ్ న్యూస్

### ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతమేనన్న ఐఎండీ

### ఎల్ నినో పరిస్థితుల కారణంగా రుతుపవనాలు బలహీనపడనున్నాయని వెల్లడి

జాతీయం: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి వ్యవసాయ రంగానికి భారత వాతావరణ శాఖ చేదువార్త చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో అంటే జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాలు.. దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా బలపడుతున్న 'ఎల్ నినో' పరిస్థితుల కారణంగా రుతుపవనాలు బలహీనపడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడు సగటు కంటే తక్కువగానే వానలు..: తొలి దశ దీర్ఘకాలిక రుతుపవన అంచనాలను విడుదల చేస్తూ ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర కీలక వివరాలు వెల్లడించారు. "ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ)లో 92 శాతంగా ఉండే అవకా శం ఉంది. సాధారణంగా 90 నుంచి 95 శాతం మధ్య వర్షపాతం నమోదు అయితే దానిని సాధారణం కంటే తక్కువగా పరిగణిస్తాం" అని వివరించారు. ఈ ఏడాది వర్షాలు తగ్గడానికి 31 శాతం అవకాశం ఉండగా.. డెఫిషియంట్ (90% కంటే తక్కువ) కేటగిరీకి పడిపోయేందుకు 35 శాతం అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఖరీఫ్, రబీ పంటలపై ఎల్ నినో దెబ్బ..: ముఖ్యంగా దేశంలోని 'మాన్‌సూన్ కోర్ జోన్'గా పిలిచే మధ్య, పశ్చిమ భారత ప్రాంతాల్లో వర్షపాత లోటు స్పష్టంగా కనిపిస్తోందని ఐఎండీ చీఫ్ స్పష్టం చేశారు. అయితే వర్షాలపైనే ఆధారపడి సాగు అయ్యే ఈ






ప్రాంతాల్లో తక్కువ వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటల సాగు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని అన్నారు. అంతేకాకుండా వర్షాలు తగ్గడం వల్ల జలాశయాల్లో నీటి నిల్వలు క్షీణిస్తాయని.. ఇది కేవలం సాగునీటికే కాకుండా శీతాకాలంలో వేసే రబీ పంటలకు అవసరమైన భూగర్భ తేమను కూడా దెబ్బతీస్తుందన్నారు. తద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి, ధరలు పెరిగే ఆస్కారం ఉందని వివరించారు. అయితే ఎల్ నినో ప్రభావాన్ని అడ్డుకునే ఒక సానుకూల అంశాన్ని కూడా ఐఎండీ ప్రస్తావించింది. హిందూ మహాసముద్రంలో ఏర్పడే 'ఇండియన్ ఓషియన్ డైపోల్' (ఐఓడీ) పరిస్థితులు ఆగస్టు నాటికి సానుకూలంగా మారే అవకాశం ఉంది. ఒకవేళ ఐఓడీ పాజిటివ్‌గా ఉంటే.. అది ఎల్ నినో వల్ల కలిగే నష్టాన్ని కొంత వరకు భర్తీ చేసి, సీజన్ ద్వితీయార్థంలో వర్షాలు కురిసేలా చేస్తుంది. కానీ ఐఓడీ పరిస్థితులు అత్యంత అస్థిరంగా ఉంటాయని శాస్త్రవేత్తలు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే పశ్చిమాసియా యుద్ధం వల్ల పెరిగిన ఇంధన, ఎరువుల ధరలతో సతమతమవుతున్న రైతులకు.. వాతావరణ శాఖ ఇచ్చిన ఈ నివేదిక మరింత ఆందోళన కలిగిస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాల ఏ స్థాయిలో కురుస్తాయనే దానిపై మే నెల చివరి వారంలో ఐఎండీ మరింత స్పష్టమైన నివేదికను విడుదల చేయనుంది. చూడాలి మరి ఏం జరగనుంది అనేది.

# శోభనం కావాలంటే రూ.90 లక్షలు ఇవ్వు..

## ఫస్ట్ నైట్ రోజే వరుడికి షాకిచ్చిన వధువు




జాతీయం: జీవితాంతం తోడుంటానని ఏడడుగులు వేసింది.. అగ్నిసాక్షిగా కట్టుకున్న వాడికి అండగా ఉంటానని ప్రమాణం చేసింది. కానీ, ఆ అగ్ని సాక్షిగా జరిగిన పెళ్లిలో ఆనందం ఒక్క రోజైనా నిలవలేదు. అదే అగ్ని ఆ వరుడి పాలిట మృత్యువుగా మారింది. కేవలం డబ్బు పిచ్చితో ఓ నవవధువు చేసిన ఘాతుకం ఇప్పుడు అందరూ ముక్కున వేలేసుకొనేలా చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాలో అత్యంత భయానక ఘటన వెలుగులోకి వచ్చింది. పెళ్లి జరిగిన ఆనందం ఆ ఇంట్లో ఒక్క రోజు కూడా నిలవలేదు. మొదటి రాత్రి శోభనం గడపాలంటే లక్షల రూపాయలు కావాలని వధువు డిమాండ్ చేయడం, దానికి వరుడు నిరాకరించడంతో అతడిని సజీవ దహనం చేసేందుకు ప్రయత్నించడం స్థానికంగా కలకలం రేపింది.

అసలు ఏం జరిగిందంటే..?:వరుడి సోదరి ముస్కాన్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది ఏప్రిల్ 29న ఆగ్రాకు చెందిన యువకుడికి కల్పన అనే యువతితో ఘనంగా వివాహం జరిగింది. వివాహ క్రతువు ముగిశాక శోభనం కోసం కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం వధూవరులను ఆడపడుచులు గదిలోకి పంపారు. ఇక్కడే అసలు మలుపు (ట్విస్ట్) చోటుచేసుకుంది. వధువు తనపై ఉన్న మేలిముసుగు తీయడానికి ఏకంగా రూ.90 లక్షల నగదు కావాలని డిమాండ్ చేసింది.

సంవత్సరం కాలంగా బెదిరింపులు..: అంత పెద్ద మొత్తం ఇవ్వలేమని వరుడు స్పష్టం చేయడంతో.. మరుసటి రోజే తనకు శోభనం వద్దంటూ వధువు కల్పన, పెళ్లిలో పెట్టిన నగలతో సహా పుట్టింటికి వెళ్లిపోయింది. తొలిరాత్రి జరిగిన విషయాన్ని తన తండ్రి, సోదరులకు చెప్పింది. కాగా, డబ్బు డిమాండ్‌తో మొదలైన ఈ వివాదం ఇక్కడితో ఆగలేదు. వధువు కుటుంబ సభ్యులు వరుడి ఇంటిపై దాడులు చేయడం, వాట్సాప్ ద్వారా బెదిరింపులకు పాల్పడటం మొదలుపెట్టారు. అడిగినంత డబ్బు ఇవ్వకపోతే కుటుంబం మొత్తాన్ని సజీవ దహనం చేస్తామని హెచ్చరించారు.

కుటుంబం మొత్తాన్ని సజీవ దహనానికి ప్లాన్..: ఇలా ఏడాది కాలం గడిచింది. ఈ ఏడాది మార్చి 26న వధువు కుటుంబ సభ్యులు వరుడి ఇంటికి వచ్చి గొడవకు దిగారు. ఇరు కుటుంబాల మధ్య మాట మాట పెరిగింది. ఈ క్రమంలోనే వధువు తండ్రి, సోదరుడు వరుడి ఇంట్లో ఉన్న పీఎన్‌జీ గ్యాస్ పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి, కుటుంబం మొత్తాన్ని మంటల్లో కాల్చి చంపేందుకు ప్రయత్నించారు. ఈ దుర్ఘటనలో వరుడితో పాటు అతడి తల్లిదండ్రులకు గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ స్థానికులు హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వధువు తరఫు కుటుంబ సభ్యుల ఒత్తిడితో పోలీసులు మొదట వరుడి ఫిర్యాదుపై స్పందించలేదు. చివరకు బాధితులు కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆగ్రా పోలీసులు ఇప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హత్యాయత్నం, బలవంతపు వసూళ్ల కింద వధువు కుటుంబంపై కేసులు నమోదయ్యాయి. ఒక పవిత్రమైన బంధాన్ని కేవలం డబ్బు కోసం వ్యాపారంగా మార్చేయడం, అదీ విద్యావంతులు ఉన్న సమాజంలో ఇలాంటి ఘటనలు జరగడం పట్ల జనం విచారం వ్యక్తం చేస్తున్నారు.

# అతిథి పక్షులకు స్వర్గధామం





వరంగల్, : అనేక సంవత్సరాలుగా వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే విదేశీ అతిథి పక్షులకు స్వర్గధామంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి నిలుస్తోంది. ప్రకృతి అందాలతో నిండినఈ గ్రామంలోని చెరువులు, చెట్లు వలస పక్షులను అక్కున చేర్చుకుని, ఆశ్రయం ఇచ్చి.. పురుడుపో స్తున్నాయి.అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంర క్షణ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల పుట్టినిల్లుగా ఏళ్ల తరబడి నిలబెడుతున్న గ్రామస్తులు ఎంతో స్ఫూర్తి నిస్తున్నారు. పక్షుల తల్లిప్రేమను, పిల్లల కేరింతలను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతున్నారు. సైబీరియా వంటి చల్లని ప్రాంతాల నుంచి పక్షులు, ముఖ్యంగా కొంగలు (పెయింటర్ స్టోర్క్) మేచరాజుపల్లికి తరలివచ్చి, నివాసం ఏర్పరచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేల సంఖ్యలో సైబీరియన్ కొంగలు, ఇతర వలస పక్షులు చేరుకుంటాయి. చల్లని దేశాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వేడి ప్రాంతాల కోసం ఈ పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయా ణించి ఇక్కడకు ప్రతి ఏటా క్రమం తప్పకుం డా వస్తాయి.డిసెంబర్ నుంచి జూలై వరకు గ్రామంలోని చెట్లపై గూళ్లు కట్టి గుడ్లు పెట్టి సంతానోత్ప త్తి చేసి, పిల్లలు పెద్దయ్యాక తిరిగి జూలై నెలలో పిల్లలతో కలిసి తమ స్వదేశాలకు వెళ్లిపోతాయి. వీటి ప్రధా న ఆహారం చెరువులోని చేపపిల్లలు. చేప పిల్లలను వేటాడి చెట్లపై నిలువ పెట్టుకోవడం మరో ప్రత్యేకతగా నిలుస్తోంది.మేచరాజుపల్లి చెరువు పరిసర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పక్షుల కిలకిలారావాలు వినిపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంటాయి. గుంపులుగా ఎగిరే పక్షు లు ఆకాశంలో అద్భుత దృశ్యాన్ని సృష్టిస్తా యి. ఈ కాలంలో చెట్లపై కనిపించే వందలాది విదేశీ అతిథి పక్షులను చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు.గ్రామస్థులు ఈ పక్షులను తమ అతిథులుగా భావించి, సంరక్షణ చర్యలు చేపడుతు న్నారు. ప్రతి ఏడాదీ వచ్చే విదేశీ అతిథి పక్షు ల రాక కోసం నిరీక్షించడం, చెట్లను నరకకుండా కాపాడటం, పక్షులకు ఇబ్బంది కలి గించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇలా అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంరక్షణ బాధ్యతలను తు.చ తప్పకుండా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల ఆవాసంగా ఏళ్ల తరబడి నిలబెట్టుతున్నారు.ఒక్కో పక్షి మూడు నుంచి నాలుగు గుడ్లు పెట్టి, 30 నుంచి 45 రోజుల పాటు పొదుగుతుంటాయి. జన్మించిన తమ పిల్లలకు ఇక్కడే ఎగరడం, మేత మేయడం, ఆహారాన్ని సంపాదించడం తదితర నైపుణ్యాలను తల్లి పక్షులు నేర్పిస్తుంటాయి. ఈ ప్రకృతి విన్యాసాలను, తల్లిప్రేమను, పిల్లపక్షుల కేరింతల ను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతుంటారు. ప్రకృతి అందాలు, విదేశీ వలస పక్షుల సందడి కారణంగా మేచరాజుపల్లి పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పక్షి ప్రేమికులకు, ప్రకృతి సందర్శకులకు ఆకర్షణీయ ప్రాంతంగా అభివృద్ధి చెం దుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పక్షుల సంరక్షణకు చెరువు అభివృద్ధి, చెట్ల సంరక్షణ, పర్యాటక సదుపాయాల కల్పన వంటి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.పర్యావరణ పరిరక్షణ తో పాటు పర్యాటకాభివృద్ధి జరిగితే మేచరాజుపల్లి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది. వేల కిలోమీటర్ల ప్రయా ణం చేసి వచ్చే అతిథి పక్షులతో మేచరాజుపల్లి ప్రకృతి సోయగంగా మారుతూ నిజమైన పక్షుల స్వర్గధామంగా నిలుస్తోంది

## 14 ఏళ్ల నాటి కల..

కరీంనగర్, : రాజకీయాల్లో ఏ వ్యూహం ఎప్పుడు పారుతుందో.. ఏ స్కెచ్ ఎప్పుడు ఫలిస్తుందో ఎవరూ ఊహించలేరు. ప్రత్యర్థి పార్టీని నామరూపాలు లేకుండా చేయాలనే పంతం పన్నెండేళ్ల తర్వాత ఇప్పుడు కార్యరూపం దాల్చడం చూస్తుంటే రాజకీయ చదరంగం ఎంత చిత్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో కాంగ్రెస్‌ను ఖాళీ చేయాలని కేసీఆర్ వేసిన ప్లాన్ చేశారు. ఇన్నాళ్లకు 'జగిత్యాల టైగర్' జీవన్ రెడ్డి రూపంలో సక్సెస్ అయింది. అప్పట్లో త్రుటిలో తప్పిన ఈ ఫిరాయింపు, ఇప్పుడు రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయాల పుణ్యమా అని సాధ్యపడింది. రాజకీయాల్లో ఫిరాయింపులు కొత్త కాదు కానీ, పన్నెండేళ్ల క్రితం వేసిన స్కెచ్ ఇప్పుడు ఫలించడం విశేషం. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరినీ టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) కలిపేసుకోవాలని గట్టి ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనే జీవన్ రెడ్డికి గులాబీ గూటి నుంచి ఆహ్వానం అందింది. అయితే ఈ విషయాన్ని తాజాగా జరిగిన ప్రెస్ మీట్‌లో జీవన్ రెడ్డి స్వయంగా బయటపెట్టారు.

అటు కేటీఆర్ కూడా 'ఆయన 2014లోనే మా పార్టీలోకి రావాల్సింది, అది ఇప్పటికి కుదిరింది' అని వ్యాఖ్యానించడం ద్వారా నాటి స్కెచ్‌ను పరోక్షంగా ఒప్పుకున్నట్లు అయ్యింది.జగిత్యాల పంచాయతీ జీవన్ రెడ్డి మనస్థాపానికి ప్రధాన కారణం తన రాజకీయ ప్రత్యర్థి సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడమే. రెండు ఎన్నికల్లో తనను ఓడించిన వ్యక్తిని రేవంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించడాన్ని జీవన్ రెడ్డి తట్టుకోలేకపోయారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోవడం, మెజారిటీ కౌన్సిలర్లు సంజయ్ వర్గం వైపు ఉండడంతో జీవన్ రెడ్డికి సొంత గడ్డపైనే భంగపాటు జరిగింది. మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కకపోవడంతో తన రాజకీయ భవిష్యత్తుపై ఆయన ఒక నిర్ణయానికి వచ్చారు. ఎంతో కాలం నిరీక్షించిన జీవన్ రెడ్డి రేవంత్ రెడ్డి నాయకత్వంపై యుద్ధం ప్రకటించారు.

# భారత రైతాంగ సమస్యలకు పరిష్కారం ఎప్పుడు..?

వ్యవసాయ సంక్షోభ నివారణకు, రైతు ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు ఆదాయ-సామాజిక భద్రత చేకూర్చేందుకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి (సి2 ప్లస్ 50 శాతం) చట్టబద్ధ ఎం.ఎస్.పి ధరలు ప్రకటించాలని 2006 లోనే నివేదిక నిచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. రైతాంగ సమస్యల పరిష్కారం చేస్తానని 2021 డిసెంబర్ 9వ తేదీన ఇచ్చిన లిఖితపూర్వక హామీని తుంగలో తొక్కడమేకాక, కనీస మద్దతు ధరల విధానానికి మంగళం పాడుతూ "జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం" (ఎన్.పి.ఎఫ్.ఎ.ఎమ్)ను ప్రకటించి, "పంట ధర ఇన్సూరెన్స్" ముసుగులో ఎం.ఎస్.పి ని ఎత్తివేసే ద్రోహానికి ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వం పూనుకొంది. 2000 నుండి 2013 మధ్య కాలంలో ఎం.ఎస్.పి ధరలు తక్కువగా నిర్ణయించబడటం వలన 23 పంటల పైన భారత రైతాంగానికి రూ.45 లక్షల కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని ఒ.ఇ.సి.డి-ఐ.సి.ఆర్.ఐ.ఇ.ఆర్ సంస్థలు పేర్కొన్నాయి. సగటున ఏటా రైతాంగానికి రూ.3 లక్షల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఉదాహరణకు క్వింటాలు వరి ధాన్యానికి రూ.766, మొక్కజొన్నకు రూ.704, జొన్నకు రూ.1,110, కందికి రూ.2,874, మినుముకు రూ.2646, పెసరకు రూ.2,446, పత్తికి రూ.2365 చొప్పున నష్టపోతున్నారు. అందుకే చట్టబద్ధ ఎం.ఎస్.పి ధరలను ప్రకటించాలని పట్టుబడుతున్నాం.

**ప్రైవేట్ వారికోసమే విద్యుత్ సవరణ చట్టం:** వ్యవసాయానికి ఉచిత/తక్కువ టారిఫ్‌తో విద్యుత్, బలహీన వర్గాల పేదలకు రాయితీ విద్యుత్‌లను తొలగించి, మొత్తం ఖర్చులన్నిటితో లెక్కించిన టారిఫ్‌ను, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి, నెలలో ముందుగానే సెల్‌ఫోన్ల తరహాలో బిల్లులు వసూలు చేయాలనే దుష్ట విధానాన్ని ఎన్.డి.ఎ. ప్రభుత్వం తెచ్చింది. అంతేకాక పలు దశాబ్దాల కాలంలో ప్రజల నుండి పన్నుల ధనం, బ్యాంకుల నుండి/పి.ఎఫ్.సి నుండి రుణాలతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, విద్యుదుత్పత్తి సంస్థలు, డిస్కమ్‌లతో సహా కారుచౌకగా (బుక్ వాల్యూకు) ప్రైవేట్ వారికి కట్టబెట్టే ఈ దుష్ట చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాం.


**విత్తన చట్టం రైతాంగ వ్యతిరేకం:** విత్తన చట్టం 1966 లోని లోపాలను సరిచేయడానికి బదులు, విదేశీ విత్తన కంపెనీల ప్రయోజనాలను మెరుగు పరిచేందుకు తీసుకువచ్చిన ఈ చట్టంలో నాణ్యత లేని నకిలీ విత్తనాల వల్ల రైతులకు చేకూరిన నష్టానికి పరిహారం గురించి లేకపోవడం అత్యంత ఆశ్చర్యకరం. బహుళజాతి, విదేశీ విత్తన కంపెనీల తెరచాటు సూచనలతో రూపొందించబడిన ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాం.

**ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి చట్టాన్ని అమలు చేయాలి:** గ్రామీణ నిరుపేదలకు ఉపాధిని, ఆదాయాన్ని సమకూరుస్తూ, ఆహార భద్రతను పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో గాంధీజీ పేరు తొలగించడమేకాక, రాజ్యాం గం లోని ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా, రాష్ట్రాల హక్కులను హరిస్తూ, రాష్ట్రాలను సంప్రదించకుండానే 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం ద్వారా దేశంలోని కోట్లాదిమంది నిరుపేదలకు ఎన్.డి.ఎ ప్రభుత్వం ద్రోహం చేస్తున్నది. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి చట్టాన్ని అటకెక్కి ంచడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంగా కనబడుతోంది. అందువలననే వి.బి.గ్రామ్‌జీ పథకాన్ని ఉపసంహరించి...మరికొన్ని మార్పులతో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

**పంట భూములను లాక్కోవడం ఆపాలి:** షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, ఇతర అణగారిన, వెనుకబడిన వర్గాల, పేదల ప్రయోజనాలను పరిరక్షించేందుకు భారత రాజ్యాంగం పేర్కొన్న సూత్రాలను భారత సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పులను దృష్టిలో వుంచుకొని, వాటికి భంగం కలుగని రీతిలో భూములను కేటాయించడం అవసరం. కేవలం పారిశ్రామికవేత్తలు కోరిన చోట, కోరినంత విస్తీర్ణాన్ని ఇవ్వాలనుకోవడం తగదు. ప్రజా ప్రయోజనం కోసం మాత్రమే ప్రభుత్వం భూమిని సేకరించాలని, రైతుల పంట పొలాలను, ముఖ్యంగా బలహీన వర్గాలకు ఎసైన్ చేసిన భూములను తీసుకోరాదని డిమాండ్ చేస్తున్నాం.

**నూతన జాతీయ సమగ్ర కౌలు చట్టం అవసరం:** కౌలు రైతులు అత్యధికంగా భూమి లేని, సన్నకారు, చిన్న రైతులు, బలహీన వర్గాలకు చెందినవారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలను అందించడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు నీతి ఆయోగ్ సంస్థ "మోడల్ ల్యాండ్ లీజ్ చట్టాన్ని" అమలు చేయాలని రాష్ట్రాలకు పంపించింది. అయితే ఈచట్టం ప్రకారం రైతుతన భూమిని ఫలానా వ్యక్తికి కౌలుకిచ్చినట్లుగా సంతకం చేయాల్సి వుంటుంది. వెనుకటి కాలంలో వున్న కౌలు చట్టాలు రద్దయ్యాయన్న సమాచారం తెలియకపోవడం, తన భూయాజమాన్య హక్కుకు భంగం కలుగుతుందేమోనన్న అనుమానంతో రైతులలో అత్యధికులు సంతకం చేయడానికి ముందుకు రావడం లేదు. ఫలితంగా కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద, ధనిక రైతులవద్ద హెచ్చువడ్డీలకు రుణాల తీసుకోవలసిన పరిస్థితులు న్నాయి.

## రీ ఎంట్రీకి విజయసాయిరెడ్డి..!



నెల్లూరు, : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా రాజధాని ప్రతిపాదన విషయంలో జగన్ చుట్టూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు ఆ పార్టీకి టిడిపి, జనసేన బలమైన ప్రత్యర్థులుగా ఉన్నారు. కానీ ఆ జాబితాలో ఇప్పుడు చాలా పార్టీలు వచ్చి చేరుతున్నాయి. చివరకు ఇప్పటివరకు స్నేహంగా వ్యవహరించిన గులాబీ పార్టీ సైతం రూటు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. అమరావతి రాజధాని విషయంలో పక్కన ఉన్న తెలంగాణలో సైతం జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రతికూలత వస్తోంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లు పై చర్చ జరిగిన సమయంలో కాంగ్రెస్ సభ్యురాలు రేణుకా చౌదరి మాటలు చూస్తే మాత్రం జగన్ పై వ్యతిరేకత ఎలా ఉందో అర్థమవుతుంది. మరోవైపు అది చాలదన్నట్టు జగన్మోహన్ రెడ్డి మావిగన్ రాజధాని ప్రతిపాదనను సొంత పార్టీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నాయి. ఎప్పుడు సోషల్ మీడియాలో జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసేవారు సైతం దిక్కుమాలిన సలహా అంటూ విరుచుకుపడుతున్నారు. మావిగన్ ప్రతిపాదన అనేది జగన్మోహన్ రెడ్డి సొంత నిర్ణయం అని సజ్జల లాంటి వారు మీడియా ముందుకు వచ్చి చెప్తున్నారు.అయితే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్మోహన్ రెడ్డి నిర్ణయం ఫైనల్ అన్నట్టు ఉండేది. జగన్ పై ఈగ వాలితే అంతా పడిపోయేవారు. కానీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చించే క్రమంలో జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నాయి వివిధ పార్టీలు. కానీ కనీసం కౌంటర్ ఇవ్వలేకపోయారు ఆ పార్టీ నేతలు. నిండు రాజ్యసభలో జగన్మోహన్ రెడ్డి పై కాంగ్రెస్ ఎంపీలు విరుచుకుపడితే ఏం చేస్తున్నట్టు అని ఆ పార్టీకి గుడ్ బై చెప్పిన ఎంపి విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ఇదేనా మీ సమర్థత అంటూ ప్రశ్నించడం ప్రారంభించారు. ఇక్కడ విజయసాయిరెడ్డి రెండు రకాల లక్ష్యాలను నెరవేర్చుకున్నారు. ఒకటి తనలాంటి వాడు జగన్ వెంట లేకపోవడం లోటు అని సంకేతాలు పంపాడు. కేంద్ర రాజకీయాల్లో వైసీపీకి అత్యవసరంగా ఒక నేత అవసరం అని గుర్తు చేశారు.మరోవైపు కూటమికి వ్యతిరేకంగా ట్వీట్ చేశారు విజయసాయిరెడ్డి. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పించడం ఎంత ముఖ్యమో.. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయడం అంతే ముఖ్యం అని హెచ్చరిస్తూ స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. కొత్త రాజధాని ప్రతిపాదన కంటే రైతుల సమస్యలపై వైసీపీ పోరాడితే బాగుంటుందని సూచనలు ఇచ్చారు. అయితే ఇప్పటికీ తాను కూటమికి వ్యతిరేకమని.. అవసరం అనుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధమని సంకేతాలు పంపగలరు. ఏడాది కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ ద్వారా వచ్చిన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన ఆయన తరువాతే ఎందుకో రాజకీయాలు మాట్లాడుతూ వచ్చారు. రాజకీయాలు చేయాలని ఉందని చెప్పుకొచ్చారు. బిజెపిలోకి వెళ్తారని కూడా ప్రచారం జరిగింది. కానీ కూటమి నుంచి అభ్యంతరాలు రావడంతో ఆయన డిఫెన్స్ లో పడిపోయారు. అందుకే జగన్ ఒప్పుకుంటే తిరిగి వైసీపీలో చేరుతానని సంకేతాలు పంపుతున్నారు. కానీ జగన్ అందుకు ఒప్పుకుంటారో? లేదో? చూడాలి.

## జనారణ్యంలోకి జంతువులు



కర్నూలు, : రాయలసీమ వ్యాప్తంగా జనావాసాల్లోకి చిరుతల చొరబాట్లు పెరగడం కనిపిస్తోంది. పులులకు తీవ్రమైన నీటి కొరత, ఆవాసాలు తగ్గిపోవడం, పెరుగుతున్న పర్యావరణ ఒత్తిడే ఈ ధోరణికి కారణమని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోకపోతే.. ఈ ప్రాంతంలో మానవ-వన్యప్రాణుల సంఘర్షణ తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్న బకరపురం గ్రామంలో ఇటీవల జరిగిన ఓ ఘటన జరిగింది. గ్రామంలోకి ప్రవేశించిన చిరుత పిల్లను వీధి కుక్కలు చంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ అధికారుల సమాచారం ప్రకారం, రాయలసీమలో గత మూడేళ్లలో మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించిన 30కి పైగా చిరుతలు మరణించాయి. ఆందోళనకరంగా, గత సంవత్సరంలోనే 16 మరణాలు నమోదయ్యాయి.చిరుతపులులు మేకలు, గొర్రెలు, దూడలు, ఆవులు వంటి జంతువులను ఇష్టపడతాయి. ఆహారం కోసం అవి మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయి. కొన్నిసార్లు, అటవీ ప్రాంతాల్లో సమీపంలో నీటి వనరులు లేకపోవడం కూడా ఒక కారణంగా ఉంది. చిరుతపులులు దట్టమైన అడవుల్లో లోపల ఉండటానికి బదులుగా, కొద్దిగా బహిరంగ లేదా మైదాన ప్రాంతాల్లోకి వెళ్లడానికి ఇష్టపడతాయని అటవీ అధికారులు అంటున్నారు.చిరుతపులులు మనుషులపై దాడి చేయడానికి బయటకు రావడం లేదు. కానీ ఆకస్మాత్తుగా మనిషి ఎదురైతే దాని రక్షణలో భాగంగా దాడి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. వాటి సంచారం ప్రధానంగా ఆహారం, నీటి అన్వేషణ కోసమే ఉంటుంది. అడవుల అంచున ఉన్న గ్రామాల్లోకి చిరుతలు ఎక్కువగా వస్తుంటాయి.వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులు, అడవి పందులను నివారించడానికి రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలు పులులకు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కంచెల కారణంగా ప్రమాదవశాత్తు మరణాలు పెరుగుతున్నాయి. రైతులలో తక్షణమే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.అటవీ భూముల ఆక్రమణలతో పులుల సహజ ఆవాసాలను తగ్గిపోయేలా చేస్తూ, వన్యప్రాణులను మానవ నివాసాలకు మరింత దగ్గరగా నెడుతున్నాయి. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ఇప్పుడు జనావాస ప్రాంతాల వైపు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉందని, ఇది తమ జీవనోపాధికి ముప్పుగా మారిందని రైతులు వాపోతున్నారు.కొన్నిసార్లు పొలాల దగ్గర చిరుతపులులు సంచారం ఉన్నట్టుగా రైతులు చూస్తున్నారు. దానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పశువులను, మేకలను మేతకు బయటకు తీసుకెళ్లాలంటే భయపడుతున్నాయి.

## సమ్మెకు దిగిన విద్యుత్ ఆర్టిజెన్ ఉద్యోగులు!

### పర్మనెంట్ చేసి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్!

జనగామ :తాము దశాబ్దాల తరబడి ఎట్టి చేస్తున్నప్పటికీ మాతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న మా విద్యుత్ శాఖ మమ్మల్ని పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించకుండా, నిర్లక్ష్యం చేస్తున్నదని,పాలకులు మమ్మల్ని ధగా చేస్తున్నరని విద్యుత్ శాఖలో పని చేస్తున్న వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు.ఉద్యమ ప్రభుత్వం 2017 లో పర్మనెంట్ చేస్తానంటే ఉద్దరిస్తుందని నమ్మినం. కానీ 2020 లో కొత్త సర్వీస్ రూల్ తెచ్చి నమ్మి నానబోస్తే పుచ్చిబుర్రలు చేసి తెచ్చిపోసినట్లు ఉత్త చేతులు మా మొఖాన కొట్టిందని,గత ప్రభుత్వాలు చేసిన అన్యాయాన్ని సరిదిద్ది నేటి ప్రభుత్వం మాయడల మానవత్వాన్ని ప్రదర్శించాలని,మా న్యాయ మైన డిమాండ్లను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కోరుతున్నరు. ఈ రోజు స్టేషన్ ఘనపూర్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబి రంలో ప్రసంగించి నకార్మిక సంఘం నేతపాశం రాజుతదితరులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్హతల ఆధారంగా ఇప్పటి వరకు పర్మనెంట్ కాని ఉద్యోగులను అందరిని పర్మనెంట్ ఉదోగులుగా ఆయా కేటగిరిల్లో విలీనం చేసుకోవాలని,కెసిఆర్ ప్రభుత్వం తెచ్చిన సర్వీస్ రూల్సుకు చరమ గీతం పాడి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, కోరారు.టీజీ ఎస్పీడీసీఎల్,టీజీ ఎన్పిడీసీఎల్ లోని అన్ మాన్డు వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేసుకోవాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.4-12-2016 కంటేముందు విద్యుత్ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న విద్యావంతులను ఆర్టిజెన్ లుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యుత్ శాఖలో అనేక అవసరాల్లో వినియోగించుకుంటూ,ఏ గుర్తింపు ఇవ్వకుండా ఎట్టివాళ్లుగాఉట్టిగనే వదిలేసిన వాళ్లలోని అర్హులైన పీస్ రేట్ కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించి 2026 పీర్సీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## వైసీపీతో బీసీవై కలిసి పోటీ..!

విజయవాడ,: రాజకీయాల్లో ఎవరు ఎప్పుడు ఏ స్థితిలో ఉంటారో చెప్పలేము. ఎందుకంటే ఒకసారి ఓటమి ఎదురవుతుంది. మరోసారి గెలుపు తలుపు తడుతుంది. అయితే రాజకీయ అవసరాలు కూడా అంతే. ఎవరితో ఏ అవసరం వస్తుందో చెప్పలేం కూడా. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అదే పరిస్థితి. ప్రత్యర్థి పార్టీలను ఓ రేంజ్ లో వేసుకోవడం వైసీపీకి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అయితే ఈ విషయంలో జనసేన కూడా బాధితురాలు. ఎందుకంటే జనసేన ను టార్గెట్ చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రచారం అంటూ లేదు. మొన్న జనసేన సంపూర్ణ విజయం, వైయస్సార్ కాంగ్రెస్ దారుణ ఓటమితో ఈ ప్రచారం కొట్టుకెళ్లిపోయింది. కానీ ఇప్పుడు అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భారత చైతన్య యువజన పార్టీ.. అలియాస్ బిసివై పార్టీపై ఆధారపడుతోందన్న టాక్ ప్రారంభం అయింది. ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడుతుండడం కొత్త రాజకీయ పరిణామం.చిత్తూరు జిల్లాకు చెందిన బోడె రామచంద్ర యాదవ్ భారత యువజన చైతన్య పార్టీని ఏర్పాటు చేశారు. బడుగులకు రాజ్యాధికారం అన్న నినాదంతో ఈ పార్టీని స్థాపించారు. పారిశ్రామికవేత్త అయిన బోడే రామచంద్ర యాదవ్ కు కేంద్రంలో మంచి పట్టు ఉంది. 2019 ఎన్నికలకు ముందు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి జనసేన తరఫున పుంగనూరు నుంచి పోటీ చేశారు. కానీ ఓటమి ఎదురయింది. కనీసం డిపాజిట్లు రాలేదు. అయితే తరువాత భారత చైతన్య యువజన పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బీసీవై పార్టీని టార్గెట్ చేశారు. పలుమార్లు బోడే రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి కూడా జరిగింది. కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేస్తూ చంద్రబాబు బీసీవై పార్టీ వెనుక ఉన్నారనేది అప్పట్లో ఒక విమర్శ. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అయితే బోడె రామచంద్ర యాదవ్ పై ఓ రేంజ్‌లో విరుచుకుపడేవారు. ఆయన పేరును ప్రస్తావించేందుకు కూడా ఇష్టపడేవారు కాదు. పూజకు పనికిరాని పువ్వు అని సంబోధించేవారు. గతంలో బోడె రామచంద్ర యాదవ్ పై దాడి జరిగినప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఖండించారు. ఒక సాధారణ నేతగా ఉన్న బోడె రామచంద్ర యాదవ్ విషయంలో ప్రతిపక్ష నేత స్పందించడం అప్పట్లో ఒక సంచలనమే. కనీసం బీసీవై పార్టీ ఒక పార్టీయేనా అని వ్యాఖ్యానించేవారు వైసీపీ సామాన్య కార్యకర్తలు.. కానీ ఇటీవల ఎందుకో బోడె రామచంద్ర యాదవ్ రూట్ మారింది. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వాన్ని విపరీతంగా వ్యతిరేకిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి విషయంలో సానుకూలంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి కట్టాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అందులో భాగంగానే బీసీవై పార్టీని కూటమి ప్రభుత్వంపై ఉసిగొల్పుతున్నారన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# హైదరాబాద్ కు మరో డాల్బీ థియేటర్!



## నీళ్ల ట్యాంకు ఓవర్‌ఫ్లోతో నీరు వృధా

### వాహనదారులకు ప్రమాదం

కొడిమ్యాల: కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిదేవాలయం పక్కన ఉన్న నీళ్ల ట్యాంకు నుంచి ప్రతిరోజూ నీరు వృథాగా ట్యాంకు నిండి రహదారిపై పొర్లిపోతు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్య గతంలో బైరి రాధ సర్పంచ్‌గా ఉన్న కాలం నుంచే కొనసాగుతోందని స్థానికులు తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 12 గంటల నుంచి 2 గంటల మధ్య ట్యాంకు నిండిపోవడంతో నీరు రోడ్డు పైకి పొంగిపొర్లుతుందని పేర్కొన్నారు. వృథాగా పారుతున్న ఈ నీటితో సుమారు నాలుగు ఎకరాల పంట సాగు చేయవచ్చని స్థానికులు అంటున్నారు. సమస్యకు పరిష్కారంగా ట్యాంకుకు ఓవర్‌ఫ్లో పైప్ ఏర్పాటు చేసి, సబ్‌స్టేషన్ మూలం నుంచి కిరాణా దుకాణం వరకు పైప్‌లైన్ వేయాలని సూచిస్తున్నారు.అక్కడి నుంచి సబ్‌స్టేషన్ ఫెన్సింగ్ పక్కనజేసీబీ ద్వారా కాలువ తవ్వి, ఇందూరు పోచమ్మ రోడ్డుకు అనుసంధానం చేస్తే గ్రామపంచాయతీ మురికి కాలువలోకి నీరు మళ్లించవచ్చని తెలిపారు.ప్రస్తుతం వర్క్‌షాప్ యజమానులు మట్టి పోసి మూసివేసిన మురికి కాలువను తిరిగి తెరిస్తే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని, నీరు నడిమి కుంటకు చేరుతుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

హైదరాబాద్, : రెండు వారాల కిందట హైదరాబాద్‌లో ప్రారంభమైన అల్లు సినిమాస్ డాల్బీ థియేటర్ ఇప్పుడు నగరానికే ఓ స్పెషల్ అట్రాక్షన్. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యామిలీ పేరుతో దేశంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు కూడా హైదరాబాద్‌కు మరో డాల్బీ థియేటర్‌ను తీసుకురాబోతున్నారు. మహేష్‌కు థియేటర్లు కొత్తకాదు.. ఆయన చాలా ఏళ్లుగా ఈ బిజినెస్‌లోనే ఉన్నారు. ఇప్పుడు మహేష్ కూడా హైదరాబాద్‌కు డాల్బీ తెస్తున్నారు.సూపర్ స్టార్ మహేష్‌బాబు చాలా ఏళ్ల కిందటి నుంచి వివిధ రకాల బిజినెస్‌లలో ఉన్నారు. అందులో ముఖ్యమైంది మూవీస్. ప్రముఖ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్ ఆసియన్ సునీల్ భాగస్వామ్యంతో మహేశ్‌బాబు ఎఎంబీ సినిమాస్‌ను ప్రారంభించారు. ఈ బ్యానర్ కింద వివిధ నగరాల్లో మల్టిప్లెక్స్‌లు ఉన్నాయి. అల్లు సినిమాస్ ఈ మధ్యన హైదరాబాద్‌లో డాల్బీ థియేటర్‌ను ప్రారంభించింది కానీ.. అసలు సౌత్ ఇండియాలో మొట్టమొదటి డాల్బీ థియేటర్‌ను ఇంట్రడ్యూస్ చేసింది మహేష్ బాబే. ఈ జనవరి 16న బెంగళూరులోని లో సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి డాల్బీ థియేటర్‌ను మహేష్ ప్రారంభించారు. 9 స్క్రీన్‌లు ఉన్న ఆ మల్టిప్లెక్స్ లో 588 సీట్లు ఉన్న పెద్ద థియేటర్‌ను డాల్బీగా మార్చారు. ఇప్పుడు అదే క్రమంలో హైదరాబాద్‌కు ఆయన డాల్బీ థియేటర్‌ను తెస్తున్నారు. హైదరాబాద్ సినిమా కూడలి అయిన ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ని సుదర్శన్ థియేటర్‌ను మహేష్‌బాబు భాగస్వామ్యంలో ఆసియన్ సంస్థ ఏఎంబీ క్లాసిక్ పేరుతో మల్టిప్లెక్స్‌గా మారుస్తోంది. పాత థియేటర్ స్థానంలో మొత్తం 7 స్క్రీన్ల మల్టిప్లెక్స్ అక్కడ వస్తోంది. ఇప్పుడు అందులో ఓ ఆడిటోరియంను డాల్బీ థియేటర్‌గా మారుస్తున్నారు. 4ఐ లేజర్ ప్రొజెక్షన్‌తో డాల్బీ విజన్ స్క్రీన్ అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే కోకాపేటలో దేశంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్ అందుబాటులోకి వచ్చింది. ఇది వెస్ట్ హైదరాబాద్‌లో ఉంటే.. మహేష్ డాల్బీ థియేటర్ హైదరాబాద్ నడిబొడ్డున రానుంది. పైగా క్రాస్‌రోడ్ అంటే సినిమా జంక్షన్. సో నగరవాసులకు అందుబాటులోకి స్క్రీన్ వస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి క్లాసిక్ డాల్బీ రెడీ కానుంది. మహేష్‌బాబు సినిమానే కాదు... హైదరాబాద్‌లో అతి తొందరలోనే మరో డాల్బీ సినిమా అందు?టులోకి వస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ జీడిమెట్ల రంగా థియేటర్‌ను తీసుకుని దానిని పూర్తిగా ఆధునీకరిస్తోంది. ఈ థియటర్‌కూడా డాల్బీ విజన్ స్క్రీన్‌తో సిద్ధమవుతున్నట్లు సమాచారం. అది ఈ ఏడాది జూన్ నాటికే రెడీ అవుతుందంట.. అయితే ఇక హైదారబాద్ వాసులకు పండుగే. ఈ ఏడాది చివరినాటికి మొత్తం మూడు డాల్బీ థియేటర్లు హైదరాబాద్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే నగరంలోని పెద్ద స్క్రీన్, థియేటర్ అయిన ప్రసాద్స్ కూడా ఆధునీకరించారు. లేటెస్ట్.. ప్రొజెక్షన్ అందుబాటులోకి తెచ్చారు. ఇక హైదరాబాద్‌కు ఉన్న లోటు స్క్రీన్.




ఒకప్పుడు ప్రసాద్స్‌లో ఉన్న ఐ మ్యాకస్ సేవలు నిలిచిపోవడంతో ఆ లోటు అలాగే మిగిలిపోయింది. ఇప్పుడు మన సినిమాలు భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో వస్తున్నాయి. భారీ స్క్రీన్‌లపై వాటిని అనుభూతి చెందితే ఆ థ్రిల్లే వేరు. వారణాసి, రామయణ్ లాంటి ఇండియన్‌మూవీస్‌ను ఇప్పుడు ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరించారు. మరికొన్ని భారీ సినిమాలు కూడా వస్తాయి. అయితే హైదరాబాద్‌లో స్క్రీన్ కూడా మహేష్‌బాబునే తీసుకొచ్చే అవకాశం ఉంది. ఆసియన్ భాగస్వామ్యంతో హకీంపేట్ వద్ద భారీ థియేటర్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో ఓ స్క్రీన్ ఐమాక్స్ అవుతుందనే ప్రచారం జరుగుతోంది కానీ.. దానిని వాళ్లు అధికారికంగా ధృవీకరించలేదు.

## సైబారాబాద్‌లో మరో టవర్!


హైదరాబాద్, : సైబరాబాద్ నగరపాలక సంస్థ కోసం కైత్లాపూర్‌లో రూ.200 కోట్లతో కొత్తగా సమీకృత భవన సముదాయాన్ని నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 5 ఎకరాల విస్తీర్ణంలో జీ+8 అంతస్తులతో సైబర్ టవర్స్ తరహాలో ఇది నిర్మాణం కానుంది. ఒకే భవనంలో మున్సిపల్, జలమండలి, రెవెన్యూ, విద్యుత్ శాఖల కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. ప్రజలకు పరిపాలనను మరింత సులభతరం చేసేలా ఈ క్యూఆర్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక రూపుదిద్దుకుంది.హైదరాబాద్ నగరం అనగానే అందరికీ ఠక్కున గుర్తొచ్చేది మాదాపూర్‌లోని సైబర్ టవర్స్. ఐటీ విప్లవానికి చిహ్నంగా నిలిచిన ఆ కట్టడం తరహాలోనే.. ఇప్పుడు అత్యాధునిక హంగులతో మరో భారీ భవన సముదాయం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్ నగరపాలక సంస్థ కోసం ఈ ఐకానిక్ భవనాన్ని నిర్మించబోతున్నారు. ఐటీ కారిడార్‌లో పాలనను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ నూతన పరిపాలన భవనం కోసం కైత్లాపూర్‌లోని ఐదెకరాల భూమిని అధికారులు ఎంపిక చేశారు. సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవన నిర్మాణానికి ఇంజినీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.ప్రస్తుతం సీఎంసీ కార్యాలయం హైటెక్స్‌లోని న్యాక్ భవనంలో కొనసాగుతుండగా.. కమిషనర్ సృజన ఆధ్వర్యంలో నూతన భవన ఆకృతుల రూపకల్పన వేగంగా జరుగుతోంది. ప్రభుత్వ ఆమోదం పొందిన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం జీహెచ్‌ఎంసీని పునర్వ్యవస్థీకరించి జీహెచ్ఎంసీ, సీఎంసీ (సైబరాబాద్), ఎంఎంసీ (మల్కాజిగిరి)లుగా విభజించిన సంగతి తెలిసిందే. సీఎంసీ పరిధిలోకి మణికొండ, నార్సింగి, శేరిలింగంపల్లి నుంచి మేడ్చల్ వరకు 3 జోన్లు, 16 సర్కిళ్లు వచ్చాయి. ఈ భారీ భవనాన్ని 'జీ+8' అంతస్తులతో నిర్మించనున్నారు. కేవలం మున్సిపల్ కార్యాలయం మాత్రమే కాకుండా.. ప్రజలకు అన్ని సేవలు ఒకే చోట అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.ఒకే గొడుగు కింద అన్ని విభాగాలు చేర్చనున్నారు. ఈ సమీకృత భవన సముదాయంలో సీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్, జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం, విద్యుత్, రెవెన్యూ శాఖల విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు వివిధ పనుల కోసం వేర్వేరు కార్యాలయాలకు తిరిగే అవసరం లేకుండా.. ఒకే భవనంలో అన్ని ప్రభుత్వ సేవలు లభించేలా ప్రణాళికలు రూపొందించారు. ఐటీ నగరిలో ఈ కొత్త భవనంమరో ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సైబరాబాద్ నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయని అంటున్నారు.

## రాజ్యసభ రేసు.. భారీగా పెరుగుతున్న ఆశావహులు



విజయవాడ, : తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్ల కేటాయింపు అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్ లో ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలకు గాను, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై పార్టీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మిగిలిన స్థానాలకు రకరకాల పేర్లు చర్చల్లోకి వస్తున్నాయి. టీడీపీ ఐటీ విభాగంలో చురుగ్గా ఉంటూ, గత ఎన్నికల్లో పార్టీ సోషల్ మీడియా వ్యూహకర్తగా పనిచేసిన చింతకాయల విజయ్ పేరు రేసులో ముందుండటానికి ప్రధాన కారణం యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అధిష్టానం ఆలోచనే. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి బలమైన బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విజయ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొని పార్టీ కోసం నిలబడినందుకు ఆయనకు ఈ గుర్తింపు దక్కవచ్చని క్యాడర్ భావిస్తోంది.మరోవైపు, పార్టీలో అత్యంత సీనియర్ నేత అయిన యనమల రామకృష్ణుడు పేరు కూడా చర్చల్లో ఉంది. గత కొంతకాలంగా ఆయన రాజ్యసభకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా, ఆర్థిక వ్యవహారా ల్లో పట్టున్న నేతగా యనమల సేవలను ఢిల్లీ స్థాయిలో ఉపయోగిం చుకోవాలని అధిష్టానం భావిస్తే ఆయనకు అవకాశం దక్కవచ్చు. అయితే, సామాజిక సమీకరణాలు, కొత్త రక్తాన్ని ఎక్కించాలనే లోకేష్ వ్యూహం కారణంగా సీనియర్లకు ఏ మేరకు ప్రాధాన్యత ఉంటుందన్నది ఉత్కంఠగా మారింది. వ్యాపార కారణాలు, రాజకీయ ఒత్తిళ్ల వల్ల గత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్న గల్లా జయదేవ్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పడంలో ఆయనకు ఉన్న అనుభవం, అంతర్జాతీయ స్థాయిలో ఆయనకున్న నెట్‌వర్క్ పార్టీకి అవసరమని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఆయన రాజకీయాలకు బ్రేక్ ఇస్తున్నట్లు గతంలోనే ప్రకటించినందున, మళ్లీ రాజ్యసభ ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిఉంది. ఇక గత ఎన్నికల్లో చాన్స్ దొరకని దేవినేని ఉమకూడా రేసులోఉన్నారు. యువ నేతలువంగవీటిరాధాతో పాటు మహాసేన రాజేష్ వంటి వారు కూడా సామాజికవర్గ కోటాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు ప్రధానంగా మూడు సూత్రాలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. బీసీ, ఎస్సీ, కాపు సామాజిక వర్గాలకు సమతుల్యత పాటించడం..కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా మాట్లాడగలిగే వ్యక్తులను పంపే అంశాలను పరిశీలిస్తున్నారు. వీరితో పాటు పార్టీ కోసం పనిచేసిన మరికొందరు పారిశ్రామికవేత్తలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా టీడీపీ పరిశీలిస్తోంది. ఢిల్లీలో పార్టీ వాయిస్ బలంగా వినిపించే వారికే చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మిత్రపక్షాలకూ సీట్లు కేటాయించాల్సి ఉంది. జాతీయ స్థాయి ప్రాధాన్యత దృష్ట్యా బీజేపీ ఓ సీటును కోరుకుంటుందని అంచనా వేస్తున్నారు. బీజేపీకి ఇస్తే జనసేన పార్టీకి చాన్స్ ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

## యూఎస్ రాజధాని వాషింగ్టన్ డీసీలో విజయతోరణం..



ఢిల్లీ,: అగ్రరాజ్యం అమెరికా కు రాజధాని నగరమైన వాషింగ్టన్ డీసీ లో భారీ విజయ తోరణాన్ని నిర్మించేందుకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన ప్రణాళికను అమెరికా ప్రభుత్వానికి చెందిన యూఎస్ కమిషన్ ఆన్ ఫైన్ ఆర్ట్స్ శుక్రవారం విడుదల చేసింది. తోరణంపై 250 అడుగుల ఎత్తైన రెక్కల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆ విగ్రహం చేతిలో న్యూయార్క్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ చేతిలో ఉన్నట్లుగా కాగడా ఉండనుంది. అదేవిధంగా తలపై కిరీటం ఉంటుంది. విగ్రహానికి రెండువైపులా రెండు గద్దలు, నాలుగు సింహాల విగ్రహాలు ఉంటాయి. అన్ని విగ్రహాలకు బంగారు పూత వేస్తారు. ఈ తోరణం తూర్పు భాగంలో లింకన్ మెమోరియల్, పశ్చిమ భాగంలో ఆర్లింగ్టన్ జాతీయ శ్మశానవాటిక ఉంటాయి. కొత్త నిర్మాణం పూర్తయితే 99 అడుగుల ఎత్తులో ఉన్న లింకన్ మెమోరియల్ దీనికన్నా చిన్నదిగా కనిపిస్తుంది. భారీ విజయతోరణం ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన, అందమైనదిగా నిలుస్తుందంటూ ట్రంప్ సోషల్ మీడియాలో తాజాగా ఒక పోస్ట్ పెట్టారు. వాషింగ్టన్ డీసీ ప్రాంతానికి అది ఒక అద్భుతమైన అదనపు ఆకర్షణగా మారుతుందని అన్నారు. కాగా అమెరికా స్వాతంత్ర్యాన్ని పొంది 250 ఏళ్లవుతున్న సందర్భంగా ఈ భారీ నిర్మాణాన్ని తలపెట్టారు. అమెరికాకు 1776లో స్వాతంత్ర్యం వచ్చింది.

## అన్నసాగర్ లో ఆరోగ్య శిబిరం

ఎల్లారెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పల్లె దావకన (అన్నసాగర్) లో "మాత్మల్ "వైద్యధికారి డా"శరత్ కుమార్ సార్ ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ డీసిజ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది, తగిన పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్, క్యాన్సర్ రాకుండా తాగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించడం జరిగింది, అదే విధంగా సరైన డైట్ తీసుకోవాలని, వ్యాయామం చేయాలని తెలిపారు.



## ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు !



ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరాన్ నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహ్రైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు హోర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది.ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధ నౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే హోర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.




# దసరాకు రిలీజ్ చేసేలా.. ఫౌజీ షూటింగ్ స్పీడ్




ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకు లకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనుల ను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయంఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి..దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# అడివి శేష్ కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్.. రాహుల్ రవీంద్రన్‌తో క్రేజీ కాంబినేషన్!




టాలీవుడ్ హీరో అడివి శేష్ తన వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు అలరిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. తాజాగా ఆయన నటించిన డెకాయిట్ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందన అందుకుంటోంది. దర్శకుడు షానీల్ డియో తెరకెక్కించిన ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటించగా, ప్రముఖ నటులు అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా అడివి శేష్ తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. నటుడు–దర్శకుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తాను ఓ సినిమా చేయబోతున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించాడు. ఇటీవల రాహుల్ రవీంద్రన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తెరకెక్కించిన ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రం మంచి ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో ఆయన శేష్ కోసం కూడా ఒక బలమైన కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.అయితే ఈ క్రేజీ కాంబినేషన్ వెంటనే పట్టాలెక్కే అవకాశాలు లేవు. ప్రస్తుతం అడివి శేష్ తన సూపర్ హిట్ చిత్రం గూఢచారికి సీక్వెల్‌గా వస్తున్న +2 షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ పనులు పూర్తయ్యాకే రాహుల్ రవీంద్రన్ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అడివిశేష్ సెలెక్టివ్ కథలఎంపిక, రాహుల్ రవీంద్రన్ ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్ కలవడంతో ఈ కొత్త సినిమా ఇప్పటికే సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ కాంబినేషన్ నుంచి మరో విభిన్నమైన సినిమా రావడం ఖాయం అని అభిమానులు భావిస్తున్నారు. చూద్దాం ఈ ప్రాజెక్ట్ గురించి పూర్తి క్లారిటీ ఎప్పుడు వస్తుందో అనేది. కాగా, భారీ అంచనాలతో థియేటర్స్ లోకి వచ్చిన డెకాయిట్ మూవీఓ మోస్తరు వసూళ్లు రాబడుతున్నట్టు తెలుస్తుంది. ఈ మూవీ లాభాల్లోకి చేరుకుంటుందా లేదా అనే చర్చ జోరుగా నడుస్తుంది.

# విజయ్ సినిమా లీక్.. పైరసీపై విరుచుకుపడ్డ సినీ ప్రముఖులు



కోలీవుడ్ స్టార్ విజయ్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'జన నాయకన్' విడుదలకు ముందే లీక్ అవ్వడం ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో పెను సంచలనాలను సృష్టిస్తుంది. రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్న విజయ్‌కి ఇది చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించిన సుమారు 5 నిమిషాల కీలక సన్నివేశాలు, టైటిల్ కార్డ్స్ మరియు క్లైమాక్స్ భాగాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కావడం చిత్ర యూనిట్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది. కొన్ని చోట్ల పూర్తి ఎణ వెర్షన్ కూడా లీక్ అయిందనే వార్తలు ఇండస్ట్రీ వర్గాలను కలవరపెడుతున్నాయి. ఈ దారుణమైన పైరసీ చర్యను సౌత్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఖండిస్తున్నారు. దర్శకుడు ఏఆర్ మురుగదాస్ ఈ ఘటనపై స్పందిస్తూ.. ఒక సినిమా వెనుక వేలాది మంది కష్టం ఉంటుందని, ఇలాంటి చర్యలు పరిశ్రమను నాశనం చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హీరో కార్తీ కూడా దీనిపై ఘాటుగా స్పందిస్తూ, పైరసీ అనేది కేవలం దొంగతనం మాత్రమే కాదు, ఒక కళాకారుడి కష్టాన్ని మరియు కలలను చంపడమేనని పేర్కొన్నారు. అభిమానులు ఎవరూ ఈ లీకైన వీడియోలను చూడవద్దని, షేర్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు దర్శకుడు పా రంజిత్ డిజిటల్ సెక్యూరిటీలోని లోపాలను వేలెత్తి చూపుతూ, పైరసీ వెబ్‌సైట్లపై కఠినమైన చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. చిరంజీవి, కమల్ హాసన్, శివకార్తికేయన్ వంటి అగ్ర తారలు కూడా 'జన నాయకన్' టీమ్‌కు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాణ సంస్థ ఖచీ ప్రొడక్షన్స్ ఇప్పటికే రంగంలోకి దిగి, లీక్ చేసిన వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# అల్లు అర్జున్ ఫ్యూచర్ లైనప్ ఫుల్ బిజీ..
# ప్రశాంత్ నీల్ సినిమా ఎప్పుడు?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యూచర్ ప్రాజెక్ట్స్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. 'రాకా' సినిమా తర్వాత ఆయన ఎవరితో పని చేయబోతున్నారు? అన్న ప్రశ్నపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న రాకా పూర్తయ్యిన వెంటనే అల్లు అర్జున్ తన డ్రీమ్ లైనప్‌ను అమలు చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లైనప్‌లో స్టార్ డైరెక్టర్లు ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా ఉండటం విశేషం. అయితే అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బన్నీ–ప్రశాంత్ నీల్ కాంబినేషన్ మాత్రం వెంటనే ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దానికి ప్రధాన కారణం ప్రశాంత్ నీల్ ప్రస్తుతం యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ సినిమాతో బిజీగా ఉండడం . ఈ భారీ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా రూపొందనుందని సమాచారం. నీల్ తన స్టైల్ ప్రకారం ఈ రెండు భాగాలను పూర్తి చేసిన తర్వాతే కొత్త ప్రాజెక్ట్‌ను చేపట్టే అవకాశం ఉంది. అందువల్ల అల్లు అర్జున్‌తో ఆయన సినిమా ప్రారంభం కొంత ఆలస్యం కావచ్చు. మరోవైపు అల్లు అర్జున్ షెడ్యూల్ కూడా బిజీగానే ఉంది. ప్రస్తుతం 'రాకా'పై దృష్టి పెట్టిన ఆయన, ఆ తర్వాత వెంటనే దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో చేయనున్న #AA23 ప్రాజెక్ట్‌లో పాల్గొనాల్సి ఉంది. ఈ సినిమా కూడా భారీ అంచనాల మధ్య రూపొందనుంది. అలానే త్రివిక్రమ్ దర్శకత్వంలో కూడా బన్నీ ఓ మూవీ చేయనున్నట్టు సమాచారం. ఇలా ఇద్దరు స్టార్స్ తమ తమ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటంతో బన్నీ–ప్రశాంత్ నీల్ కాంబినేషన్ కోసం అభిమానులు మరికొంతకాలం వేచి చూడాల్సి వస్తోంది. అయితే ఈ కాంబినేషన్ ఎప్పుడు సెట్స్ పైకి వెళ్లినా, అది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక భారీ యాక్షన్ డ్రామాగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక ఇదిలా ఉంటే బన్నీ చేస్తున్న రాకా ప్రాజెక్ట్ బాక్సాఫీస్‌ని షేక్ చేయడమే కాకుండా అనేక రికార్డులు సెట్ చేస్తుందని అంటున్నారు.

# 'పెద్ది'పై క్రేజీ అప్‌డేట్.. ఫుల్ స్వింగ్‌లో పనులు!



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా, డైరెక్టర్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమా కోసం అభిమానులు, సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఒక కీలక అప్‌డేట్‌ను సినిమాటోగ్రాఫర్ ఆర్. రత్నవేలు పంచుకున్నారు. సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రస్తుతం కలర్ గ్రేడింగ్ పనులు ఫుల్ స్వింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ రత్నవేలు తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో కొన్ని ఫొటోలను షేర్ చేశారు. "పెద్ది కలర్ గ్రేడింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి" అని పోస్ట్ చేశారు. గతంలో కూడా ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల గురించి మాట్లాడుతూ.. "పగలు షూట్ చేయడం, రాత్రిపూట గ్రేడింగ్ చేయడం. తీరికలేని రోజులు, నిద్రలేని రాత్రులు.. ఇదంతా పెద్ద స్క్రీన్ కోసమే" అంటూ సినిమాపై తనకున్న అంకితభావాన్ని చాటుకున్నారు. ఇదిలా ఉంటే... ఇటీవలే రామ్ చరణ్ స్వయంగా సినిమా షూటింగ్ పై స్పష్టతనిచ్చారు. 'పెద్ది' సినిమా టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క పాట చిత్రీకరణ మిగిలి ఉందని ఆయన వెల్లడించారు. 'రాక్షస' చిత్ర బృందం 'పెద్ది' సెట్స్‌ను సందర్శించినప్పుడు చరణ్ ఈ వివరాలు పంచుకున్నారు. ఇటీవల రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన 'పెద్ది పెహెల్వాన్ గ్లింప్స్' సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. గతంలో విడుదలైన ఓ వీడియోలో చరణ్ క్రికెట్ బ్యాట్‌తో కనిపించగా, ఈ గ్లింప్స్‌లో మాత్రం పహెల్వాన్‌గా పూర్తి భిన్నమైన, పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. "కుస్తీ అనేది బ్యాట్ పట్టుకుని బంతిని ఎదుర్కొనే ఆట కాదు.. ప్రాణాలను పణంగా పెట్టి చావును ఎదిరించే ఆట" అనే డైలాగ్‌తో మొదలైన ఈ గ్లింప్స్‌లో కఠినమైన సాధన చేస్తూ, దృఢమైన శరీరంతో చరణ్ కనిపించారు.



Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343